
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
మంగళవారం 3 డిసెంబరు 2024



31 మండలాల్లో వర్షం

కొత్తచెరువు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను ప్రభావంతో మూడు రోజులుగా జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. 31 మండలాల్లో వర్షం కురిసింది. ఒక్క తాడిమర్రి మండలంలో మాత్రం వాన పడలేదు. 5 మండలాల్లో 2.5 మి.మీ, 7 ప్రాంతాల్లో 2.5 నుంచి 5 మి.మీ, 10 మండలాల్లో 5 నుంచి 10మి.మీ, 9 మండలాల్లో 10 నుంచి20 మి.మీ, వర్షపాతం నమోదైనట్లు కొత్తచెరువు ఏఎస్ఓ గంగాద్రి సోమవారం ప్రకటనలో తెలిపారు.

హద్దులు చెరిపేస్తున్నారు..!

భూముల రీసర్వే పేరుతో హద్దురాళ్లు
అప్పట్లో పాతేందుకు ఒక్కో రాయికి రూ.150 ఖర్చు
నాటి వైసీపీ ప్రభుత్వంలో ప్రజాధనం దుర్వినియోగం
యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు
కూటమి పాలనలో తొలగింపు ప్రక్రియ

7



ఆయుష్ పేరుతో అక్రమాలు

ఆయుష్ వైద్యం ముసుగులో 'వ్యాపారం'
అనుమతిలేకుండానే ఆస్పత్రులు, షాపుల నిర్వహణ
విజిలెన్స్ తనిఖీల్లో బట్టబయలైన అక్రమాలు
అనంతలో నాలుగు ఆస్పత్రులు, మందులషాపుల సీజ్

-వివరాలు 6లో...



గౌరవం లేదు.. వేతనమూ లేదు..!

జీతాల కోసం
ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీల ఎదురుచూపు
15 నెలలుగా అందని దుస్థితి

7



ఉచితం... దోపిడీ మార్గం..!

జోరుగా ఇసుక అక్రమ తవ్వకాలు, తరలింపు

- అడుగడుగునా నిబంధనల ఉల్లంఘన
- చోద్యంచూస్తున్న అధికారులు



ముదిగుబ్బలో ఇసుకను అక్రమంగా తరలిస్తూ పోలీసులకు పట్టుబడిన ట్రాక్టర్లు

గత వైసీపీ ప్రభుత్వం పెట్టిన ఇసుక కష్టాల నుంచి ప్రజలకు పూర్తి ఉపశమనం కల్పించాలన్న ఉద్దేశంతో కూటమి సర్కారు నూతన విధానాన్ని తీసుకొచ్చింది. ఇసుక ఉచితంగా తోలుకునే వెసులుబాటు కల్పించింది. దీంతో ఎంతో భారం తప్పిందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. సొంత ఇంటి నిర్మాణానికి ఉచితంగా తోలుకునే వీలు కల్పించడంతో ఆర్థిక భారం తగ్గుతోంది. ఎప్పుడు అవసరమైతే అప్పుడు ఇసుక తెచ్చుకోవచ్చు. దీంతో ఉచిత ఇసుక విధానంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఇందులో కూడా ఇసుక మాఫియా అక్రమ మార్గాలు వెతుకుతోంది. ఉచిత ఇసుక విధానం మాటున దోపిడీ సాగిస్తోంది. నిబంధనలు ఉల్లంఘిస్తూ ఎక్స్‌కవేటర్లతో తవ్వకాలు చేపట్టి, టిప్పర్లలో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

- ముదిగుబ్బ, ఆంధ్రజ్యోతి

ఎక్స్‌కవేటర్‌తో తవ్వకాలు.. టిప్పర్లతో రవాణా..

కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తెచ్చింది. నది పరీవాహక ప్రాంతాల నుంచి ట్రాక్టర్లలో ఇసుకను ఉచితంగా తీసుకెళ్లవచ్చని ప్రకటించింది. ఇదే అదునుగా భావించిన కొందరు నాయకులు రాత్రింబవళ్లు ఇసుకను తవ్వుకుని దర్జాగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కింది స్థాయి అధికారులను భయపెడుతూ రవాణా సాగిస్తున్నారు. రెవెన్యూ, మైనింగ్, ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. చిత్రావతి నదికిరువైపులా ధర్మవరం, బత్తలపల్లి, తాడిమర్రి, ముదిగుబ్బ మండలాలున్నాయి. నిబంధనల ప్రకారం చుట్టుపక్కల గ్రామాల వారికి మాత్రమే ఇసుక ఉచితం. అన్నిపార్టీల నాయకులు సిండికేట్ అయి సొంత మనుషులను ఏర్పాటుచేసుకుని, ఇసుకను లోడింగ్ చేస్తూ రవాణాతో సొమ్ము చేసుకుంటున్నారు. దూరాన్ని బట్టి ఎక్కువ ధరకు ఇసుక విక్రయిస్తున్నారు. ట్రాక్టర్‌లో ఇసుకను నింపేందుకు రూ.1000, అక్కడి నుంచి తరలించేందుకు దూరాన్ని బట్టి ధరలు నిర్ణయిస్తున్నారు. ముదిగుబ్బ మండలంలోని పీసీరేవు ఇసుక రీచ్ నుంచి బత్తలపల్లికి ట్రాక్టర్ ఇసుక రూ.3వేలు, ధర్మవరానికి రూ.5వేలు చొప్పున సరఫరా చేస్తున్నారు. ఇలాగే బ్రహ్మదేవరమర్రికొట్టాల నుంచి మద్దిలేరు వాగులో ఇష్టారాజ్యంగా ఇసుకను తోడేస్తున్నారు. బత్తలపల్లి మండలంలోని గరిశనపల్లి సమీపాన కొందరు టిప్పర్లతో ఇసుక రవాణా చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. ట్రాక్టర్లకు తరలించేందుకు మాత్రమే ఇసుక ఉచితమని ప్రభుత్వం చెబుతున్నా.. ఎక్స్‌కవేటర్లను ఏర్పాటు చేసుకుని, టిప్పర్లతో రాత్రింబవళ్లు తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు.

తనిఖీలు మరిచిన అధికారులు

కొందరు స్వార్థపరులు, నాయకులు ఉచిత ఇసుక విధానాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. దీనిమాటున ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఇదంతా తెలిసిన సంబంధిత అధికారులు మాత్రం వీటిపై దృష్టి సారించట్లేదన్న విమర్శలు మూటగట్టుకుంటున్నారు. తనిఖీలు చేసిన పాపాన పోలేదు. గత వైసీపీ పాలనలో ఇసుక రీచ్‌లలో ఆధిపత్యం కోసం ఆ పార్టీలోని రెండు గ్రూపులు బహిరంగంగానే దాడులు చేసుకుని, ఇన్నోవా వాహనాన్ని దహనం చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం కూడా అవే పరిస్థితులు నెలకొన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక రీచ్ వద్ద కూడా ఆధిపత్య అజమాయిషీ కోసం కొందరు కూటమి నాయకుల మధ్య అంతర్గత పోరు నడుస్తోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



ముదిగుబ్బ మండలం కొడవండ్లపల్లి వద్ద రీచ్‌లో ఎక్స్‌కవేటర్‌తో ఇసుకను తోడుతున్న దృశ్యం

ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు



ధర్మవరం రెవెన్యూ సబ్ డివిజన్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు, టిప్పర్లను స్వాధీనం చేసుకుని, కేసులు నమోదు చేస్తున్నాం.

- శ్రీనివాసులు, డీఎస్పీ, ధర్మవరం

అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తాం

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కేసులు నమోదు చేసి, జరిమానాలు విధిస్తాం. పేదల గృహనిర్మాణాలు ఇతర అభివృద్ధి పనులకు ఇసుక ఉచితం. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవ్.

-రామ్మోహన్, ఏడీ, మైనింగ్ శాఖ

సైనిక సంక్షేమ నిధికి విరివిగా విరాళాలివ్వండి

కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపు



సైనిక సంక్షేమనిధి పోస్టరు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తదితరులు

పుట్టపర్తి టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): దేశంకోసం ప్రాణాలు త్యాగం చేసిన సైనికుల సంక్షేమనిధికి విరివిగా విరాళాలు అందించాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ కోరారు. ఈనెల 7న నిర్వహించే సైనిక పతాక దినోత్సవ ప్రచార పోస్టర్లను సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశం కోసం సరిహద్దుల్లో ఎంతోమంది సైనికులు ప్రాణత్యాగం చేశారన్నారు. వారి కుటుంబ సభ్యుల బాధ్యతను దేశ ప్రజలు స్వీకరించాలన్నారు. ఇందుకోసం సైనిక సంక్షేమనిధికి విరాళాలు అందించి, చేయూత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లాసైనిక సంక్షేమాధికారి తిమ్మప్ప, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్వో విజయసారధి పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): మండలాల ప్రత్యేకాధికారులు వారానికోసారి క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు 185 ఫిర్యాదులు సమర్పించారు. వాటిని కలెక్టర్ స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలానికి కేటాయించిన ప్రత్యేకాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, వారి పరిధిలోని సమస్యలను పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపాలిటీల పరిధిలో రైతు బజార్ల ఏర్పాటుకుస్థలాలు సేకరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్వో విజయసారధి, ఆర్డీఓ సువర్ణ, డీఆర్‌డీఏ పీడీ రంగయ్య, డీఈఓ కిష్టప్ప, జిల్లా వైద్యాధికారి మంజువాణి పాల్గొన్నారు.

డీపీఓలో...

పుట్టపర్తిరూరల్: జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 35 అర్జీలు అందాయి. వాటిని జిల్లా ఎస్పీ రత్న స్వీకరించారు. అర్జీదారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిశీలించి, చట్టపరిధిలో ఉన్న వాటిని తక్షణమే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

జవాను సొమ్ము కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

పెనుకొండ మండలం శెట్టిపల్లికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాను శ్రీరాంనాయక్ పంజాబ్‌లో పనిచేస్తున్నారు. దీపావళి పండుగ సెలవులకు ఇంటికి వచ్చిన ఆయన సెల్‌ఫోన్‌కు పది రూపాయల రీచార్జ్ చేసుకోవాలని మెసేజ్ వచ్చింది. అందు కోసం ఓ లింకును పంపారు. దానిని క్లిక్ చేయగానే అకౌంట్లోని రూ.6.79 లక్షలు సైబర్ నేరగాళ్లు దోచేశారు. తమకు న్యాయం చేయాలని జవాను భార్య లీలాబాయి.. ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

భూమిని ఆక్రమించారు..

తాతల నుంచి తమకు సంక్రమించిన ఆస్తి 11.15 ఎకరాల భూమిని ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ, ఆయన తమ్ముడు వెంకటకృష్ణ ఆక్రమించారని అదే మండలం బికొట్టాల గ్రామానికి చెందిన తెలికి ఉత్తప్ప యాదవ్ వాపోయారు. ఆ భూమిలోని రూ.15లక్షల విలువచేసే టేకు, చింత, వేప, తుమ్మ చెట్లను కొట్టేసి, విక్రయించారని ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. తనకు న్యాయం చేయాలని కోరారు.



అయ్యప్ప మాలధారుడితో కలిసి భుజిస్తున్న వానరం

అనుకోని అతిథి

మడకశిర పట్టణ సమీపంలోని వడ్రపాళ్యం శ్రీరామ మందిరంలో సోమవారం అయ్యప్పస్వామి మాల ధారులు భజన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం అక్కడే వారికి భోజనం ఏర్పాటు చేశారు. అందరూ భోజనం చేస్తుండగా.. అనుకోని అతిథి వచ్చింది. భోజనం చేస్తున్న ఓ భక్తుడి వద్దకు వానరం వచ్చింది. భోజనం చేయసాగింది. దీంతో అక్కడున్న వారంతా ఆశ్చర్యపోయారు. అంతమంది ఉన్నా.. వారి మధ్యే సహపంక్తి భోజనానికి కూర్చోవడం గమనార్హం. ఆకలి మరి..

- మడకశిర టౌన్ (ఆంధ్రజ్యోతి)

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

గోరంట్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇంటర్ చదువుతున్న బాలిక పెళ్లిని ఐసీడీఎస్ అధికారులు సోమవారం అడ్డుకున్నారు. తల్లిదండ్రులు.. బాలిక చదువు మాన్పించి, మండలంలోని బూదిలి గ్రామానికి చెందిన అంజనాచారితో ఈనెల 4న వివాహం చేయాలని నిర్ణయించారు. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత.. అధికారులతో కలిసి బాలిక గ్రామానికి వెళ్లింది. పెళ్లి ఏర్పాట్లలో ఉన్న ఇరు కుటుంబాల వారిని కలిసి, కౌన్సెలింగ్ ఇచ్చారు. బాల్యవివాహాన్ని ఆపివేయించారు. అలాగే, బాలిక తమ్ముడు ఏడో తరగతితో చదువు మానేసి, ఇంట్లో ఉండగా.. కుటుంబీకులకు నచ్చజెప్పి గోరంట్ల బాలుర ఉన్నత పాఠశాలలో చేర్పించేలా ఎంఈఓ గోపాల్‌తో ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు గ్లోరీ, అంగన్‌వాడీ కార్యకర్తలు విజయమ్మ, పద్మ ఉన్నారు.

ఆశలపై నీళ్లు..!



చిక్కబళ్లాపుర-పుట్టపర్తి రైలు మార్గానికి మొండిచేయి

ప్రతిపాదనలే లేవని లోక్‌సభలో స్పష్టంచేసిన మంత్రి



బెంగళూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కొత్త జిల్లా కేంద్రం పుట్టపర్తి వాసుల ఆశలపై రైల్వే శాఖ నీళ్లు చల్లింది. చిక్కబళ్లాపుర-పుట్టపర్తి రైల్వే లైన్ నిర్మాణానికి మొండిచేయి చూపింది. రైల్వేలైన్ నిర్మాణ ప్రతిపాదనలే తమ వద్ద లేవని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తాజాగా లోక్‌సభలో ప్రకటించారు. చిక్కబళ్లాపుర నుంచి బాగేపల్లి, గోరంట్ల మీదుగా పుట్టపర్తిదాకా రైలు మార్గాన్ని ఏర్పాటు చేయాలన్న డిమాండ్ రెండు దశాబ్దాలుగా ఉంది. 15ఏళ్ల క్రితమే సర్వే కూడా పూర్తి చేశారు. పలు కారణాలతో నిర్మాణం పట్టాలెక్కలేదు. తాజాగా లోక్‌సభలో రైల్వేలైన్ ఏర్పాటుపై కేంద్ర మంత్రి స్పందించారు. రైల్వేలైన్ నిర్మాణానికి సంబంధించ తమ వద్ద ఎలాంటి ప్రతిపాదనలు లేవని స్పష్టం చేశారు. చిక్కబళ్లాపుర-పుట్టపర్తి మధ్య 103 కిలోమీటర్ల దూరం ఉందని ఆయన తెలిపారు. రైల్వేట్రాక్ ఏర్పాటుకు సర్వే చేశారన్నారు. జనసంచారం లేనందునే ప్రస్తుతానికి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టట్లేదన్నారు. చిక్కబళ్లాపుర-గౌరీబిదనూరు మధ్య 44 కిలోమీటర్ల దూరం రైల్వేట్రాక్ ఏర్పాటుకు సంబంధించి డీపీఆర్ తయారీకి అనుమతులు ఇచ్చినట్లు మంత్రి వెల్లడించారు.

పుట్టపర్తి-చిక్కబళ్లాపుర మీదుగా బెంగళూరుకు రైల్వేలైన్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ రెండు దశాబ్దాలుగా ఉంది. సత్యసాయి బాబా ఉన్నపుడే ఈ ప్రతిపాదనలపై ప్రచారం సాగింది. గతంలో పెనుకొండ నుంచి నేరుగా ధర్మవరం వెళ్లే ట్రాక్ మాత్రమే ఉండేది. ఆ తర్వాత పెనుకొండ నుంచి పుట్టపర్తి, ధర్మవరం మరో మార్గం ఏర్పాటైంది. ఈమార్గంలో కొన్ని రైళ్లు మాత్రమే సంచరిస్తున్నాయి. వెనుకబడిన ఉమ్మడి అనంతపురం జిల్లాకు రైల్వేలైన్ల ఏర్పాటు ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని అక్కడి ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. పుట్టపర్తి-చిక్కబళ్లాపుర మధ్య రైల్వేమార్గం ఏర్పాటైతే ఏడో నంబరు జాతీయ రహదారికి అనుబంధంగా ట్రాక్ రానుంది. చిక్కబళ్లాపుర సమీపంలోనే దేవనహళ్ళి అంతర్జాతీయ విమానాశ్రయం ఉండడం వల్ల భవిష్యత్తులో విమాన సర్వీసులు వినియోగించుకునేవారికి అనుకూలం కానుందని భావించారు. కేంద్ర రైల్వేశాఖ అటువంటి ప్రతిపాదనలు లేవని తేల్చడంతో ఇటు చిక్కబళ్లాపుర.. అటు శ్రీసత్యసాయి జిల్లాల ప్రజలకు నిరాశ మిగిలింది.

తెలంగాణకు చెందిన ఓ కుటుంబం హిందూపురానికి వచ్చి స్థిరపడింది. చుట్టుపక్కల వారితో ఆ కుటుంబీకులు పరిచయాలు పెంచుకున్నారు. రూ.20వేల చిట్టీతో ప్రారంభించారు. అదే ప్రాంతంలో ఉన్న కొంతమంది దుకాణదారులు, మరికొంతమంది గృహిణులను సభ్యులుగా చేర్చుకున్నారు. చిట్టీ కొన్నేళ్ల తరువాత రూ.40 లక్షల నుంచి రూ.50లక్షలదాకా పెరిగింది. ఆ కుటుంబం ఒకరోజు రాత్రికి రాత్రే అదృశ్యమైంది. వీరివద్ద కొందరు చిట్టీ వేయగా.. మరికొందరు వడ్డీకి డబ్బు ఇచ్చారు. ఆ తరువాత వారు ఎక్కడున్నారని ఆరాతీసేందుకు ప్రయత్నించినా ఆచూకీ దొరకలేదు. మోసపోయిన బాధితులు పోలీసులను కూడా ఆశ్రయించలేదు. వారు వెళ్లిపోయేటపుడు ఆచూకీ కనిపెట్టే అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తపడ్డారు.

హిందూపురం పట్టణంలోని ఓ వ్యాపారి చాలామంది వద్ద అప్పులు చేసి, కొన్ని ఆస్తులు, బంగారం, కొనుగోలు చేశారు. ఆయన తీసిన ఆస్తులు అతనిపేరున కాకుండా బంధువుల పేరుపై చేశాడు. ఇలా సుమారు రూ.3కోట్లకుపైగా అప్పులు చేశాడు. తనవద్ద ఏమీలేదని కోర్టుద్వారా ఐపీ పెట్టాడు. అప్పులు ఇచ్చినవారు చేసేదిలేక మిన్నకుండిపోయారు.

కొన్నాళ్లక్రితం హిందూపురానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధి.. కర్ణాటక వాసితో కలిసి చిట్టీలు, లాటరీల పేరుతో పట్టణంలో సుమారు 500మంది నుంచి రూ.10కోట్లకుపైగా వసూలు చేశారు. కర్ణాటకలో కూడా ఇలాగే చిట్టీలు, లాటరీలు పెట్టామనీ, అక్కడ ప్రధాన కార్యాలయం ఉందని చెప్పి కొన్నిరోజుల తరువాత అక్కడికే వెళ్లిపోయాడు. హిందూపురంలో వసూలు చేసిన రూ.10కోట్లలో రూపాయి కూడా ఇవ్వలేదు. కర్ణాటకలో వారు చెప్పిన అడ్రస్‌కు వెళ్లి ఆరాతీయగా.. అక్కడ ఎవరూలేరు. దీంతో పోలీసులను ఆశ్రయించారు. అయినా ఇప్పటికీ బాధితులకు వారి సొమ్ము అందలేదు. ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే. ఇలాంటివి హిందూపురంతోపాటు జిల్లాలో కోకొల్లలు.కొన్ని వెలుగులోకి వస్తాయి, మరికొన్ని మూసేస్తారు.

ఆశ చూపి మోసం..!

చిట్టీల పేరుతో డబ్బు వసూలు
అధిక వడ్డీ ఆశ చూపి రుణాలు
తర్వాత అదృశ్యమౌతున్న కొందరు..
ఐపీ పెడుతున్న మరికొందరు..

హిందూపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పక్కనే ఉంటారు. నమ్మకం కలిగిస్తారు. చిన్నపాటి చిట్టీ అని మొదలుపెడతారు. చిట్టీలో ఉండాలని ఒప్పిస్తారు. కొన్నాళ్లపాటు చిట్టీ డబ్బు పాడినవారికి సక్రమంగా ఇస్తారు. రూ.వేల నుంచి రూ.లక్షలకు చిట్టీలు వేసేలా ఎదుగుతారు. దర్జాగా కనిపిస్తారు. దీంతో సన్నిహితులు, వారి బంధువులు, స్నేహితులు ఇలా పరిచయమైన వ్యక్తులను తమవైపు తిప్పుకుంటారు. ఒకవైపు చిట్టీలు వేస్తూనే మరోవైపు నగదు వడ్డీకి తీసుకుంటారు. అధిక వడ్డీలు చెల్లిస్తామంటూ ఆశలు కల్పిస్తారు. అంతేకాక రూ.3 నుంచి రూ.10వడ్డీతో లక్షలు అప్పులు చేసి కొంత కాలం చెల్లిస్తారు. ఒకరికి తెలియకుండా మరొకరి నుంచి రుణాలు తీసుకుంటారు. చివరికి మోసం చేస్తారు.



చిట్టీలు, రుణాల పేరుతో..

హిందూపురం వాణిజ్యకేంద్రంగా పేరుగాంచింది. దీంతో ఇక్కడ వ్యాపారాలు చేసేవారు కోకొల్లలుగా ఉన్నారు. వీరిలో కొంతమంది పిల్లల పెళ్లిళ్లు, ఇంటి నిర్మాణం కోసం చిట్టీలు వేస్తారు. మరికొంతమంది దాచిన సొమ్ముకు వడ్డీ ఇస్తారు. కొన్నాళ్లు వారికి వడ్డీ ఇచ్చి ఆశలు రేపుతారు. ఆ తరువాత చేతులెత్తేస్తారు. పట్టణంలో ఇలాంటివారు పదుల సంఖ్యలో ఉన్నారు. వైసీపీకి చెందిన ఓ నాయకుడు కొన్నాళ్లపాటు చిట్టీలు వేశారు. మరికొంతమంది వద్ద వడ్డీకి నగదు తీసుకున్నాడు. ఆ తరువాత రూ.4కోట్లకు చేతులెత్తేశాడు. మొన్నటివరకు ఎవరైనా ఇచ్చిన డబ్బు అడిగితే అధికార పార్టీ అంటూ చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావడంతో సదరు నాయకుడు తప్పించుకునేందుకు పార్టీలో ఓ పదవి ఇప్పించుకుని ఇప్పుడుకూడా వారిని మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నాడు. ఇతడిపై గతంలో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు బాధితుడి పక్షానకాకుండా వైసీపీ నాయకుడికి మద్దతు పలికారు. దీంతో బాధితులు మిన్నకుండిపోయారు.

కొందరు పరార్.. మరికొందరు ఐపీ..

హిందూపురంలో గత పదేళ్లలో ఐపీ పెట్టినవారు 20మందిదాకా ఉన్నట్లు సమాచారం. వీరంతా రూ.కోటి నుంచి రూ.5కోట్లదాకా ఐపీ పెట్టినట్లు తెలుస్తోంది. మరికొంతమంది చిట్టీలు, వడ్డీలకు ఇప్పించుకుని ఆ మొత్తంతో ఇతర ప్రాంతాలకు ఉడాయిస్తారు. ఎవరైనా డబ్బు ఇచ్చినవారు అడిగితే వారిపైనే ఎదురు తిరుగుతున్నారు. దీంతో చేసేదిలేక బయటకు చెప్పుకోలేక బాధితులు లోలోపలే మదనపడుతున్నారు. మరికొంతమంది హిందూపురంలోనే ఉంటూ తాము నష్టపోయామని ఐపీ పెట్టేస్తున్నారు. దీంతో కష్టపడి నాలుగు రూపాయలు కూడబెట్టి సొంత అవసరాలకు దాచుకున్న డబ్బు ఇలాంటి వారికి ఇచ్చి మోసపోతున్నారు.

ఆశల వలలో పడొద్దు



కొంతమంది ఆశకుపోయి అధిక వడ్డీ వస్తుందని వేల రూపాయలు ఇచ్చి మోసపోతున్నారు. తద్వారా వడ్డీ రావడం సంగతి దేవుడెరుగు.. అసలుకే మోసం వస్తుంది. లైసెన్స్ ఉన్నవారివద్దే చిట్టీ వేయాలి. అధిక వడ్డీకి ఆశ పడకూడదు. ప్రైవేటు చిట్టీలు నిర్వహించడం నేరం. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. మోసంచేసిన వారిపై ఫిర్యాదు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- మహేష్, డీఎస్పీ, హిందూపురం

న్యూస్ బాక్స్

9న సర్టిఫికెట్ల వెరిఫికేషన్

అనంతపురం కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ అనంతపురం రీజియన్ పరిధిలో అప్రెంటిస్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 9న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. కర్నూలులోని ఆర్టీసీ జోనల్ సిబ్బంది శిక్షణా కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్టీసీ జోనల్ సిబ్బంది శిక్షణా కళాశాల ప్రిన్సిపాల్ నజీర్ అహ్మద్ సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. అభ్యర్థులు ఎస్ఎస్‌సీ, ఐటీఐ, ఎన్‌సీవీటీతోపాటు కులధ్రువీకరణ పత్రం, వికలాంగులైతే అందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాస్‌బుక్కు జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు 2, ఆధార్ కార్డు జిరాక్స్‌కాపీలతోపాటు రూ.118లు వెరిఫికేషన్ ఫీజుతో కర్నూలులోని ఆర్టీసీ జోనల్ సిబ్బంది శిక్షణా కళాశాలకు చేరుకోవాలన్నారు. డీజిల్ మెకానిక్ ట్రేడ్ అభ్యర్థులకు ఈనెల 9న ఉదయం 9 నుంచి మ ధ్యాహ్నం 1 గంట వరకు, అలాగే మోటా ర్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటింగ్, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ పనులకు సంబంధించి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందన్నారు. వివరాలకు 08518 257025 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ స్టడీ సర్కిల్‌లో నిర్వహిస్తున్న డీఎస్సీ ఉచిత శిక్షణకు జిల్లాలోని అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ కుష్బూకొఠారీ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. ఇదివరకే దరఖాస్తు చేసుకున్న వారికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో టెట్ అర్హత సాధించిన బీసీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ కింద ఈబీసీ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. టెట్‌లో అర్హతలో సాధించిన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు టెట్ మార్కుల జాబితా, టీసీ, డిగ్రీ మార్కుల జాబితా, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్, బ్యాంకు పాస్ బుక్, 2 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో కలెక్టరేట్ దగ్గర ఉన్న బీసీ స్టడీ సర్కిల్లో దరఖాస్తులను అందజేయాలన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. లక్షలోపు ఉండాలన్నారు. వివరాలకు సెల్ : 7799043773 సంప్రదించాలన్నారు.

క్రీడాభారతి అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శాప్ అనుబంధంగా ఉన్న చైతన్యకశ్యప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేసే క్రీడాభారతి అవార్డులకు అర్హులైన క్రీడాకారులు ఈనెల 4లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి (డీఎస్‌డీఓ) ఉదయ్‌భాస్కర్ తెలిపారు. 12 సంవత్సరాలుపైబడిన క్రీడాకారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. విజేతలను ఎంపిక చేయడానికి ఈనెల 8న క్రీడా పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష 25 నిముషాల పాటు ఉంటుందని, 50 ప్రశ్నలు ఉంటాయన్నారు. ఆన్‌లైన్ క్రీడా పరీక్షలో ఉత్తీర్ణులైన విజేతలకు మొదటి బహుమతిగా రూ.1లక్ష, ద్వితీయ స్థానంలో నిలిచిన ఇద్దరికి చెరో రూ.50వేలు, తృతీయ స్థానంలో నిలిచిన ఆరుగురికి ఒక్కొక్కరికి రూ.25 వేలు చొప్పున, నాలుగో అవార్డు రూ.11వేలు 11మందికి అందజేస్తారన్నారు. వివరాలకు సెల్ నంబరు 9849421462ను సంప్రదించాలని కోరారు. దరఖాస్తులను http://kreedaabharati.org/. వెబ్‌సైట్‌లో పోస్ట్ చేయాలన్నారు.

ఆయుష్ పేరుతో.. అక్రమాలు..!

- ఆయుష్ వైద్యం ముసుగులో 'వ్యాపారం'
- అనుమతిలేకుండానే ఆస్పత్రులు, షాపులు నిర్వహణ
- విజిలెన్స్ తనిఖీల్లో బట్టబయలైన అక్రమాలు
- ఇటీవల అనంతలో నాలుగు ఆస్పత్రులు, మందుల షాపుల సీజ్

"కొందరు ఆయుష్ డాక్టర్లు అక్రమదందాకు తెరలేపారు. ఆయుష్ మందులు మంచిగా పని చేస్తాయని, ఎలాంటి సైడ్ ఎఫెక్ట్‌లు ఉండవనే ప్రచారం ఎక్కువగా ఉంది. దీంతో వివిధ రోగాలతో బాధపడేవారు ఈ మందుల వైపు మొగ్గు చూపుతున్నారు. అయితే కొందరు ఆయుష్ వైద్యులు సొంతంగా ఆస్పత్రులు, మందులషాపులు ఏర్పాటు చేసుకొని 'వ్యాపారానికి' తెర తీశారు. అనుమతులు లేని ఆయుష్ మందులు అమ్ముతూ ప్రజలప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్న ఆరోపణలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో ప్రభుత్వం ఈ అక్రమ ఆయుష్ ఆస్పత్రులు, మందులషాపుల విషయాన్ని సీరియస్‌గా తీసుకుంది. రాష్ట్ర ఆరోగ్యశాఖ కమిషనర్ ఈ ఆయుష్ షాపులను పరిశీలించి వాస్తవ నివేదికలు ఇవ్వాలని విజిలెన్స్‌శాఖను ఆదేశించారు."

- అనంతపురంటౌన్ (ఆంధ్రజ్యోతి)



సాయినగర్‌లోని ధన్వంతరి ఆయుష్ మెడికల్‌షాపు

● ప్రభుత్వ ఆయుష్ డాక్టర్ల నిర్వహణ

విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన నాలుగు ఆస్పత్రుల్లో మూడు ప్రభుత్వ ఆయుష్ డాక్టర్లే నిర్వహిస్తుండటం గమనార్హం. వీరు ప్రభుత్వ ఆయుష్ ఆస్పత్రులలో ఇతర డాక్టర్ల మాదిరి గానే విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. అయితే వీరి పర్యవేక్షణ వైద్యశాఖకు సంబంధం లేదంటున్నారు. డ్రగ్స్‌శాఖకు సంబంధం లేదంటున్నారు. రాయలసీమ స్థాయిలో కర్నూలులో వీరికి సంబంధించి ఇద్దరు పర్యవేక్షణ అధికారులు ఉంటారని చెబుతున్నారు. దీంతో వీరి గురించి ఎవరూ పట్టించుకోరు కాబట్టి సక్రమంగా డ్యూటీలకు వెళ్లడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందుకే ధైర్యంగా జిల్లాకేంద్రంలో ఆయుష్ ఆస్పత్రులను పెట్టుకొని, సొమ్ము చేసుకుంటున్నట్లు విమర్శలు వస్తున్నాయి.

● జిల్లావ్యాప్తంగా ఇదే పరిస్థితి

ఆయుష్ ఆస్పత్రులు, మందుల దుకాణాలు ప్రారంభించాలంటే తొలుత రాష్ట్రస్థాయిలో ఉన్న ఆయుష్ కమిషనర్ విభాగంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అక్కడ దరఖాస్తులను పరిశీలించి, క్షేత్రస్థాయి పరిశీలనకు పర్యవేక్షణ అధికారులను పంపుతారు. అన్నీ సక్రమంగా ఉంటే రాష్ట్ర ఆయుష్‌శాఖ కమిషనర్ నుంచి హాస్పిటల్, మందులషాపు నిర్వహణకు అనుమతులు మంజూరు అవుతాయి. ఇవన్నీ ఏమిలేకుండానే జిల్లాలో ఆయుష్ ఆస్పత్రులు, మందుల షాపులు నిర్వహిస్తున్నారు. అనంతపురంలోనే కాదు కళ్యాణదుర్గం, రాయదుర్గం, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి ప్రాంతాలలో కూడా అనుమతులు లేకుండా ఆయుష్ ఆస్పత్రులు, మందుల షాపులు నిర్వహిస్తున్నారు. కాగా ప్రభుత్వ అనుమతులు లేకుండానే ఇటీవల కొందరు సొంతంగా మందులు తయారుచేసి అమ్మకాలు సాగిస్తున్నారు. ఆమందులను కూడా తక్కువ ధరకే కొనుగోలు చేసి ఈఆయుష్ ఆస్పత్రుల డాక్టర్లు, మందులషాపు యజమానులు అమ్ముతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకే దాడులు

రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకే జిల్లాలో ఆయుష్ ఆస్పత్రులు, మందులషాపుల్లో తనిఖీలు నిర్వహించాం. జిల్లాకేంద్రంలో ఆరు ఆస్పత్రులు, మందుల షాపులు తనిఖీలు చేశాం. ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించాం. దీంతో ఆయా ఆస్పత్రులు, మందుల షాపులను సీజ్ చేశాం. ప్రభుత్వానికి నివేదికలు పంపాం

- నాగభూషణం, డీఎస్పీ, విజిలెన్స్

అనుమతులు మా పరిధిలో ఉండవు

ఆయుష్ మందులషాపులకు అనుమతులు ఇవ్వడం మా పరిధిలో ఉండదు. ఆయుష్ ఆస్పత్రులు, మందుల షాపుల నిర్వహణకు రాష్ట్ర ఆయుష్ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అక్కడ అనుమతులు ఇచ్చిన తర్వాతనే ఇక్కడ ఆస్పత్రులు, మందులషాపులు ఏర్పాటు చేసుకొని నిర్వహించాలి. విజిలెన్స్ అధికారులతో పాటు నేనూ కూడా తనిఖీలకు వెళ్లిన సమయంలో అనుమతులు లేకుండానే ఆయుష్ మందుల షాపులు నిర్వహిస్తున్నట్లు బయటపడింది. దీంతో సీజ్ చేశాం.

- రమేష్‌రెడ్డి, డ్రగ్స్‌శాఖ అడిషనల్ డైరెక్టరు




ఆయుష్ మందులను పరిశీలిస్తున్న విజిలెన్స్, డ్రగ్స్‌శాఖ అధికారులు

నాలుగు ఆస్పత్రులు, మందుల షాపులు సీజ్

రాష్ట్రవ్యాప్తంగా గతనెల 25న అన్నిజిల్లాలో ఆయుష్ ఆస్పత్రులు, మందులషాపులపై దాడులు జరిగాయి. ఈక్రమంలోనే అనంత జిల్లాలో విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం, సీఐ శ్రీనివాసులు, ఏఓ వాసుప్రకాష్, జిల్లా డ్రగ్స్ ఇన్‌స్పెక్టరు రమేష్‌రెడ్డి బృందం తనిఖీలు నిర్వహించింది. జిల్లాకేంద్రంలోని ఆరు ఆయుష్ ఆస్పత్రుల తోపాటు అక్కడే నిర్వహిస్తున్న ఆయుష్ మందుల షాపులను తనిఖీ చేశారు. ఇందులో నాలుగు ఆస్పత్రులు, మందుల షాపులు ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నట్లు బయటపడింది. జిల్లా కేంద్రంలోని కమలానగర్‌లో ఉన్న మెహతాఆయుర్వేద హాస్పిటల్, రామచంద్రనగర్‌లోని సుశ్రుత ఆయుర్వేద హాస్పిటల్, అరవిందనగర్‌లోని కేరళ అమూల్య ఆయుష్ హాస్పిటల్, సాయినగర్‌లోని ధన్వంతరి ఆయుష్ హాస్పిటల్‌తోపాటు అక్కడే నిర్వహిస్తున్న ఆయుష్ మందుల షాపులను విజిలెన్స్‌శాఖ అధికారులు సీజ్ చేశారు.

పారిశ్రామికాభివృద్ధికి చొరవ చూపండి

- ఏపీఐఐసీ ఎండీ, పరిశ్రమల శాఖ కమిషనర్ అభిషిక్త్ కిషోర్

అనంతపురం అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పారిశ్రామికాభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని ఏపీఐఐసీ ఎండీ, పరిశ్రమల శాఖ కమిషనర్ అభిషిక్త్ కిషోర్ ఆదేశించారు. అనంత ఉమ్మడి జిల్లాలో సోమవారం ఆయన పర్యటించారు. తొలుత శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని ఏపీఐఐసీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సుహానా సోనీ, అక్కడి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆ తర్వాత జిల్లా పరిశ్రమల శాఖ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో పలు అంశాలపై ఆరా తీశారు. ఉమ్మడి జిల్లాలో ఏఏ రకాల పరిశ్రమలు స్థాపించారు..? ఇంకా ఏఏ పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ఔత్సాహికులు ఆసక్తి చూపుతున్నారన్న అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పారిశ్రామికవాడలను మరింత అభివృద్ధి చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే సబ్సిడీ వివరాలను క్షేత్రస్థాయిలో ఔత్సాహికులకు తెలియజేసి, పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చేలా చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సుహానా సోనీ, జిల్లా పరిశ్రమల శాఖ జీఎం శ్రీధర్, ఏడీ రాజశేఖర్‌రెడ్డి, ఐపీఓలు రవీంద్రనాథ్‌రెడ్డి, భువనేశ్వరి, నిషాంత్ తదితరులు పాల్గొన్నారు.


పరిశ్రమల శాఖ జిల్లా కార్యాలయాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ అభిషిక్త్ కిషోర్


ఎంపికైన విద్యార్థులతో నూతిమడుగు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం

నూతిమడుగు విద్యార్థుల ప్రతిభ

- రాష్ట్రస్థాయి పోటీలకు 43మంది ఎంపిక

కళ్యాణదుర్గం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్కూల్‌గేమ్స్ పోటీల్లో కంబదూరు మండలం నూతిమడుగు ఉన్నత పాఠశాల విద్యార్థులు 43 మంది అత్యంత ప్రతిభ చూపినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. పాఠశాలలో సోమవారం ఆయన పీడీలు ఓబులేసు, సంజీవరాయుడులతో కలిసి విలేకరులకు వివరాలు వెల్లడించారు. అక్టోబరు, నవంబరు నెలల్లో ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో అండర్- 14, 17, 19 గేమ్స్ కేటగిరీల్లో తమ పాఠశాల విద్యార్థులు మెరుగైన ఆటతీరుతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఖోఖో, వాలీబాల్, ఆర్చరీ, హ్యాండ్‌బాల్, వెయిట్ లిఫ్టింగ్ వంటి క్రీడల్లో ఈ 43 మంది విద్యార్థులు అద్భుత ప్రదర్శన చేసినట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో కూడా వీరు రాణించాలని అభిలషించారు. గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పీడీలను అభినందించారు.

పంటల సాగులో జాగ్రత్తలు తీసుకోండి

- సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ నారాయణస్వామి



బుక్కరాయసముద్రం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల్లో జాగ్రత్తలు తీసుకోవాలని సీనియర్ శాస్త్రవేత్త(సేద్య విభాగం) డాక్టర్ నారాయణస్వామి తెలిపారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో శనగలో పచ్చ పురుగు, మరూక మచ్చల పురుగు (గూడుపరుగు) ఉధృతి ఎక్కువగా ఉంటుందన్నారు. వర్షపు జల్లులతో కూడిన వాతావరణం లేదా ముబ్బులతో కూడిన తేమ వాతావరణం ఉంటే ఈ పురుగు ఉధృతి అధికంగా ఉంటుందన్నారు. దీని నివారణకు లీటరు నీటికి ఎమామెక్టిన్ బెంజోయోట్ నోవాల్యురాన్ 1.5 ఎంఎల్, లేదా థాయోక్లోప్రిడ్ ఫ్లూబెండమైట్ 1.25 ఎంఎల్ లేదా బోంజోయోల్ 0.4 ఎంఎల్ కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. రాబోయే మూడు రోజులు మబ్బులతో కూడిన వాతావరణం ఉంటుందని, అక్కడక్కడ చిరుజల్లులు నుంచి తేలికపాటి వర్షపాత సూచన ఉందని వెల్లడించారు. రైతులు వరి కోత పనులు వాయిదా వేసుకుంటే మంచిదని సూచించారు.

పప్పుశనగ పంటకు తెగుళ్లు

తుఫాన్ ఎఫెక్ట్...


ఎండిన పప్పుశనగ మొక్క

- పిచికారీ తప్పక చేసుకోవాలంటున్న వ్యవసాయాధికారులు
- రైతులపై మరింత ఆర్థిక భారం

పుట్లూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : మండలంలో రబీలో సాగుచేసిన పప్పుశనగ పంటకు తెగుళ్ల బెడద పీడిస్తోంది. తుపాన్ కారణంగా వారం రోజుల క్రితం కురిసిన వర్షాలతో పంటకు అగ్గి, ఏరుకుళ్లు, ఎండు తెగుళ్లు ఉధృతంగా సోకాయి. వీటిలో ఎక్కువగా ఎండుతెగుళ్లు రైతులను ముప్పుతిప్పలు పెడుతోంది. ఎండుతెగుళ్లు సోకిన పంటలో మొక్క కింది భాగం నుంచి కాండం పైవరకు ఎండిపోతోంది. ఇలా ఆ మొక్క నుంచి మరో మొక్కకు సోకుతూ పంట మొత్తం తెగుళ్లు విస్తరిస్తోంది. పప్పుశనగ పంటలోని వంక నార్వల్లో, గుంతలు ఏర్పడినచోట ఎక్కువనీరు నిల్వ ఉండడంతో పప్పుశనగ మొక్కలు కుళ్లిపోతున్నాయి. మరికొన్నిచోట్ల నీరు ఎండిపోయినా కూడా పంటలో ఎదుగుదల కనిపించడం లేదు. మండలంలోని పుట్లూరు, శనగలగూడూరు, గాండ్లపాడు, తక్కళ్లపల్లి, వెంగన్నపల్లి, నాగిరెడ్డిపల్లి, చెర్లోపల్లి, ఎస్. కొండేపల్లి, పోతిరెడ్డిపల్లి, నారాయణరెడ్డిపల్లి, మడ్డిపల్లి తదితర గ్రామాల్లో పప్పుశనగ పంటను ఎక్కువగా సాగుచేస్తున్నారు. గతంలో కంటే ఈ ఏడాది 15,300 ఎకరాల్లో శనగపంటను సాగుచేశారు. గతేడాది రబీలో వర్షం లేక పప్పుశనగను సాగుచేయలేదు. ఈ ఏడాది మాత్రం వర్షాలు బాగా రావడంతో రైతులు పప్పుశనగ పంటను ఎక్కువ గా సాగుచేశారు. అయితే రైతులను తెగుళ్లబెడద వదలడం లేదు. సాధారణంగా పప్పుశనగ పంటను పురుగులు ఆశించడం పరిపాటే. కానీ ఈ ఏడాది మాత్రం ఎండలు సరిగా లేకపోవడంతో తెగుళ్లు ఎక్కువయ్యాయి.

ట్రాక్టర్‌తో పప్పుశనగ పంటకు పిచికారి



ఎక్కువ ఖర్చు అవుతోంది



ఈ ఏడాది సకాలంలో వర్షాలు రావడంతో 11 ఎకరాల్లో పప్పుశనగ సాగుచేశాను. ఎండుతెగుళ్లు రావడంతో వాటికి క్రిమిసంహారక మందులను పిచికారి చేయాల్సి వస్తోంది. పెట్టుబడి కన్నా ఈ ఏడాది పిచికారి మందులకే ఎక్కువ ఖర్చు చేయాల్సి వచ్చింది. తెగుళ్ల నివారణకు నెలలో రెండుసార్లు పిచికారి చేశా. పిచికారి మందులతో పాటు ట్రాక్టర్ బాడుగలు సైతం అధికమవుతున్నాయి. పెట్టిన పెట్టుబడికి దిగుబడి బాగా వస్తే గిట్టుబాటు అవుతుంది.

- గోవిందు, పప్పుశనగ రైతు, చెర్లోపల్లి

వేరు నుంచి ఎండిపోతోంది



పప్పుశనగ పంటను 12 ఎకరాల్లో సాగుచేశాను. ప్రస్తుతానికి పంట ఆశించిన స్థాయిలో ఉన్నా తెగుళ్లు మాత్రం ఎక్కువయ్యాయి. తెగుళ్లు భూమిలోని వేరు నుంచి పై కాండం వరకు కుళ్లిపోయి చివరికి ఎండిపోతోంది. ఇప్పటికే మూడు సార్లు పంటకు పిచికారి చేశాను. ఇంకా తెగుళ్లతో పాటు పూతకు, పంట ఎదుగుదలకు క్రిమిసంహారక మందులను పిచికారి చేయాల్సి ఉంది. ప్రభుత్వం స్పందించి రైతులకు పిచికారి మందులను ఎక్కువ మొత్తంలో సబ్సిడీ ద్వారా పంపిణీ చేస్తే బాగుంటుంది.

- శివశంకర్‌రెడ్డి, పప్పుశనగరైతు శనగలగూడూరు

సస్యరక్షణ చర్యలు తీసుకోండి



పప్పుశనగ పంటలో కనిపిస్తున్న ఎండుతెగులు నివారణకు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి. తప్పనిసరిగా క్రిమిసంహారక మందులను పిచికారిచేస్తే తెగులును నివారించవచ్చు. నీరు నిలిచిన చోట తడి ఆరిన వెంటనే శాప్ మందును పిచికారి చేస్తే ప్రయోజనం ఉంటుంది. మ్యాంకోజెబ్‌తో పాటు కార్బెండజిమ్ (శాప్)ను ఎకరానికి 400 గ్రాములు పిచికారి చేసుకోవాలి. లేకపోతే హెక్సాకొనజోల్ 400 మిలీ లేదా ప్రొపికోనజోల్ 200 మిలీ ఏదో ఒకటి మాత్రమే పిచికారి చేయాలి. పంటలో తెగులు సోకినచోట పిచికారి చేసే సమయంలో కాండం మొత్తం తడిచేలా చూసుకోవాలి.

- కాత్యాయిని, వ్యవసాయాధికారి

5న రండి..!

- యాడికి ఎంపీడీఓ కార్యాలయ అధికారులకు పిలుపు
- జడ్పీ సీఈఓ కార్యాలయానికి రావాలని ఆదేశం
- రికార్డుల మాయం నివేదికపై విచారణ

యాడికి, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డుల మాయంపై సంబంధిత అధికారులు ఈనెల 5న జడ్పీ సీఈఓ కార్యాలయంలో హాజరు కావాలంటూ సీఈఓ నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో ఆ అధికారులు తమవద్ద ఉన్న ఆధారాలతో జడ్పీ సీఈఓ కార్యాలయంలో హాజరుకావడానికి సిద్ధమవుతున్నారు. 2019-20 నుంచి 2022-23 కాల వ్యవధికి సంబంధించి యాడికి మండల పరిషత్ నిధుల్లో సీనరేజస్ సెస్ కోట్ల రూపాయల్లో జమ అయ్యిందని, ఆ నిధులను నిబంధనలకు విరుద్ధంగా ఖర్చుచేశారని, పనులపై విచారణ చేయాల్సిందిగా గతంలో కొందరు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ అధికారిగా గుంతకల్లు డీఎల్‌డీఓను నియమించారు. ఆ అధికారి అక్టోబరు నెలలో యాడికి ఎంపీడీఓ కార్యాలయానికి విచారించారు. ఈ విచారణకు గతంలో పనిచేసిన ఎంపీడీఓ కొండయ్య, ఈఓపీఆర్‌డీ వెంకటేష్, పీఆర్ ఏఈలు వరప్రసాద్, ఆదినారాయణరెడ్డి, ఆంజనేయులు, దేవకుమార్ హాజరయ్యారు. మరికొందరు గైర్హాజరయ్యారు. సాధారణ నిధులకు సంబంధించిన రికార్డులు, క్యాష్‌బుక్స్, వోచర్స్, వర్క్‌లిస్ట్, మండలపరిషత్‌లో ఆమోదించిన తీర్మానాలు విచారణ సమయంలో ఇవ్వలేదు. 2019-2020లో సాధారణ నిధులకు సంబంధించిన క్యాష్‌బుక్ మాత్రమే విచారణలో చూపించినట్లు తెలిసింది. 2019-2023కు సంబంధించి రికార్డులు ఇవ్వలేదు. 2019-2023 మధ్యకాలంలో రూ.3,54,23,290 సీఎఫ్ఎంఎస్ ద్వారా ట్రాన్సాక్షన్ జరిపినట్లు విచారణలో తేల్చారు. ఈఎండీ ద్వారా 2021 జూన్9న బి. రామచంద్రారెడ్డికి రూ.50వేలు, 19-06-2021న రూ.2.50లక్షలు సెల్ఫ్‌గా అదే ఏడాది జూలై 9న రూ.1.40లక్షలు, 20-01-2022న రూ.7వేలు, 19-06-2024న రూ.26వేలు డ్రా చేసుకున్నట్లు బ్యాంక్‌స్టేట్‌మెంట్‌లో గుర్తించారు. ఈఎండీ అమౌంట్‌ను కాంట్రాక్టర్ అభ్యర్థన మేరకు కాంట్రాక్టర్‌కు ఇవ్వవలసి ఉంటుంది. వీటికి సంబంధించిన రికార్డులు కూడా ఎంపీడీఓ కార్యాలయంలో లేవని తెలిపారు. రికార్డులు అందించడానికి 15రోజులు సమయం ఇచ్చినా అధికారులు ఇవ్వలేకపోయారని నివేదికలో తెలిపారు. రికార్డు లు లేనందున పూర్తిస్థాయిలో విచారణ నిర్వహించలేకపోయామని పేర్కొన్నారు. నిధుల దుర్వినియోగం, విచారణకు రికార్డులు అందించలేని సంబంధిత అధికారులపై సీసీఏ రూల్స్‌మేరకు చర్యలు తీసుకోవాలని డీఎల్‌డీఓ విజయలక్ష్మి జడ్పీ సీఈఓకు నివేదిక ఇచ్చారు. ఆ నివేదిక ఆధారంగా అప్పటి ఎంపీడీఓ కొండయ్య, ఈఓపీఆర్‌డీ వెంకటేష్‌లను ఈనెల 5న జడ్పీ సీఈఓ కార్యాలయంలో హాజరుకావాలని ఆదేశిస్తూ సీఈఓ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి.


రికార్డులు, ఫైల్స్‌తో సీఈఓ కార్యాలయంలో హాజరుకావాలని వచ్చిన ఆర్డర్

అసలైన వారిని తప్పిస్తున్నారా?

2019-2023 మధ్యకాలంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పని చేసిన అధికారిని వదిలేసి ఎవరినో బాధ్యులను చేస్తూ విచారణకు హాజరుకావాలంటూ ఉత్తర్వులు ఇవ్వడంపై విమర్శలు వినవస్తున్నాయి. అప్పట్లో రెగ్యులర్ ఎంపీడీఓ ఉన్నప్పటికి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పెత్తనం చెలాయించిన ఆ అధికారిపై ఎందుకు చర్యలు చేపట్టడం లేదని ప్రశ్నిస్తున్నారు. రెగ్యులర్ ఎంపీడీఓగా ఉన్న కొండయ్య వేతనాన్ని కూడా సీఎఫ్ఎంఎస్‌లో ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఉన్న అనిల్ కుమార్ మంజూరు చేయడం తెలిసిందే. రికార్డులు, ఎం.బుక్కులు చూపించాల్సిన ఆ అధికారి విచారణకు హాజరుకాలేదు. రికార్డులు అప్పగించని వైనంపై చర్యలు తీసుకోవాలని విచారణ అధికారి గుంతకల్లు డీఎల్‌డీఓ జిల్లా పరిషత్ సీఈఓకు నివేదిక ఇచ్చారు. అయితే ఆ అధికారిని విచారణకు పిలవకుండా ఇతర అధికారులను పిలవడంలో ఆంతర్యమేమిటో అని మండల పరిషత్ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. రికార్డులు మాయం చేసిన ఆ అధికారి ఒక ప్రజాప్రతినిధి సిఫార్సు ద్వారా చర్యలు తీసుకోకుండా జాగ్రత్తపడినట్లు సమాచారం.

న్యూస్‌బాక్స్

పీఏబీఆర్ కుడి కాలువకు నీటి విడుదల



నీటి విడుదలకు స్విచ్ ఆన్ చేస్తున్న డీఈ వెంకటరమణ

కూడేరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పెన్న అహోబిళం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) కుడి కాలువకు ఇరిగేషన్ అధికారులు సోమవారం నీటిని విడుదల చేశారు. ఇరిగేషన్ డీఈ వెంకటరమణ స్విచ్ ఆన్ చేసి వంద క్యూసెక్కులు విడుదల చేశారు. సాయంత్రానికి 250 క్యూసెక్కులకు నీటిని పెంచుతామని అధికారులు తెలిపారు. ప్రస్తుతం డ్యాంలో 3.258 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. తుంగభద్ర డ్యాం నుంచి లింక్ చానల్ ద్వారా 258 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ఉందని, వాటి ఆధారంగా ఔట్ ఫ్లో పెంచుతామన్నారు. పీఏబీఆర్ కుడి కాలువ నుంచి 49 చెరువులకు నీటిని అందించేందుకు ఇరిగేషన్ అధికారులు కసరత్తు చేస్తున్నారు. కార్యక్రమంలో డీఈ తోపాటు ఏఈలు వెంకటరమణ, ఓబుళరెడ్డి, హిమశైల పాల్గొన్నారు.

892 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు సోమవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 892 క్యూసెక్కులు వస్తున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్-2కు 760 క్యూసెక్కులు వెళుతున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీరు నిల్వ వుందని వెల్లడించారు.

క్రైంకార్నర్

ఇనుప గేటు పడి బాలుడి మృతి



మనోజ్ తేజ (ఫైల్)

కూడేరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అమ్మమ్మ ఇంటికొచ్చి ఆనందంగా గడుపుతున్న ఓ బాలుడిని ఇనుపగేటు రూపం లో ఆదివారం మృత్యువు వెంటాడింది. స్థానికులు తెలిపిన మేరకు మండలంలోని కల్లగళ్ల గ్రామానికి చెందిన పార్వతికి గార్లదిన్నె మండలం కేశవాపురం గ్రామానికి చెందిన గోపాల్‌తో వివాహమయ్యింది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. పార్వతి శుక్రవారం తన పుట్టింటింటికి కుమారుడు మనోజ్ తేజ(4), కుమార్తె మనుశ్రీతో కలిసి వచ్చింది. ఆదివారం చిన్నారులతోపాటు మనోజ్ తేజ ఆడుకుంటున్న సమయంలో ఇంటి గేటు ఊడి తలపై పడింది. తీవ్రంగా గాయపడిన బాలుడిని అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న మనోజ్ తేజ మృతిచెందడంతో తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోదించారు.

గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు

- తల్లి, కుమార్తెకు గాయాలు



గాయపడిన వాణిశ్రీ

గుంతకల్లుటౌన్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని నక్కనదొడ్డి తండాలో సోమవారం గ్యాస్ తల్లి, కూతురు గాయపడ్డారు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు గ్రామానికి చెందిన ఎం రాముడు నాయక్ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. గత కొన్ని రోజుల నుంచి ఇంట్లో గ్యాస్ సిలిండర్ నుంచి వాసన వస్తోందన్నారు. రాముడునాయక్ భార్య వాణిశ్రీ సోమవారం గ్యాస్ పైప్ మార్చడానికి పైప్‌ను బయటకు లాగింది. దీంతో మంటలు వ్యాపించాయన్నారు. మంటల వ్యాపించడంతో వాణిశ్రీ వెంటనే తన దగ్గరే ఉన్న నాలుగేళ్ల కుమార్తె నవ్యను బయటకు తోసేసింది. ఆమె గట్టిగా కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చి వాణిశ్రీని బయటకు తీసుకువచ్చారు. గ్రామస్థులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలాన్ని చేరుకొని మంటలను ఆర్పారు. ఈ ప్రమాదంలో గాయపడిన తల్లి, కుమార్తెను గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తహసీల్దారు రమాదేవి ప్రభుత్వ ఆసుపత్రిలో బాధితులను పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు.



గాయపడిన నవ్య

హద్దులు చెరిపేస్తున్నారు..!

భూముల రీసర్వే పేరుతో హద్దురాళ్లు

- అప్పట్లో పాతేందుకు ఒక్కో రాయికి రూ.150 ఖర్చు
- నాటి వైసీపీ ప్రభుత్వంలో ప్రజాధనం దుర్వినియోగం
- యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలు
- కూటమి పాలనలో తొలగింపు ప్రక్రియ



సర్వే రాళ్లపై బొమ్మ, పేర్లను తొలగిస్తున్న కార్మికులు



చెన్నేకొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వృథాగా పడివున్న సర్వే రాళ్లు

ధర్మవరం/చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతామంటూ గత వైసీపీ పాలకులు చేపట్టిన సమగ్ర భూసర్వే రైతులకు కొత్త ఇబ్బందులను తెచ్చిపెట్టింది. ఈ విధానంతో చివరికి రెవెన్యూ, సర్వే అధికారులకు సైతం లేని తలనొప్పి వచ్చిపడింది. ప్రజాధనం భారీగా దుర్వినియోగం కాగా.. జగన్ బొమ్మతో ప్రచారానికి వాడుకున్నదే తప్ప.. రైతులకు ఒరిగిందేమీ లేదన్నది బహిరంగ రహస్యమే. భూవిస్తీర్ణాల్లో తేడాలు, ఎల్‌పీఎం నంబర్లతో సమస్యలు తలెత్తి, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రీసర్వేలో అవకతవకలకు పాల్పడ్డారని రైతులు గగ్గోలు పెట్టినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ సమస్యను గుర్తించిన ప్రస్తుత కూటమి ప్రభుత్వం సమగ్ర భూసర్వేపై ప్రత్యేక దృష్టి సారించింది. రాళ్లపై జగన్ బొమ్మ, పేర్లను తొలగించే కార్యక్రమాన్ని చేపట్టింది.

జగన్ బొమ్మతో రాళ్లు

రీసర్వేతో రైతులకు మేలు చేకూరిందేమీలేదు. సర్వే రాళ్లపై జగన్ బొమ్మ, పేరును గత వైసీపీ ప్రభుత్వం ముద్రించింది. దీనిని చాలామంది రైతులు వ్యతిరేకించారు. అయినా అప్పట్లో పాలకులు పట్టించుకోలేదు. రైతుల పొలాల్లో రాళ్లపై జగన్ బొమ్మ ఉండి తీరాల్సిందేనన్న ధోరణితో వ్యవహరించారు.

ఒక్కో రాయికి రూ.150 ఖర్చు

రీసర్వే చేసిన పొలాల్లో పాతిన రాళ్లపై కూడా గత ప్రభుత్వం భారీగా వెచ్చించింది. ఒక్కో రాయికి రూ.150 ఖర్చు చేసింది. రాళ్ల కొనుగోలులో అక్రమాలకు పాల్పడారన్న ఆరోపణలున్నాయి. జిల్లాలో 461 గ్రామాలకుగాను 161 ఊర్లలో భూముల రీసర్వే పూర్తి చేశారు. మొత్తంగా 1,34,910 రాళ్లను పొలాల్లో పాతారు. ఇటీవల కొలువుదీరిన కూటమి ప్రభుత్వం సర్వేరాళ్లపై బొమ్మ, పేర్ల తుడిపివేత ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమం శరవేగంగా సాగుతోంది. ఇప్పటివరకు 35వేల వరకు రాళ్లపై బొమ్మ, పేర్లు తుడిపివేశారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోగా ఈ తంతు పూర్తి చేయడానికి సర్వే, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సర్వే ద్వారా హద్దులు నిర్ణయించి, పొలాల్లో పాతేందుకు కొనుగోలు చేసిన రాళ్లు రైతుల పొలాల వద్ద, సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయ ఆవరణాల్లో వృథాగా దర్శనమిస్తున్నాయి.

కూటమి ప్రభుత్వం రాగానే..

భూరీసర్వే కారణంగా రైతులు పడుతున్న అవస్థలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. అధికారంలోకి రాగానే పట్టాదారు పాసుపుస్తకాలు, సర్వే రాళ్లపై ఉన్న జగన్ బొమ్మ, పేర్లను తొలగిస్తామని హామీ ఇచ్చిన మేరకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేయడంతో అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా పేర్ల తొలగింపు ప్రక్రియ శరవేగంగా సాగుతోంది.

చురుగ్గా పేర్ల చెరిపివేత

జిల్లాలో సర్వే హద్దురాళ్లపై పేర్లు తొలగించే ప్రక్రియను వేగంగా చేయిస్తున్నాం. ఎప్పటికప్పుడు సిబ్బంది ద్వారా పనులను పర్యవేక్షిస్తున్నాం. ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి ఎలాంటి గడువూ లేదు.

- విజయశాంతి, ఏడీ, సర్వే భూరికార్డుల శాఖ, శ్రీసత్యసాయి జిల్లా



ఆగిన క్లాప్ వాహనాలు

సార్.. జీతాలివ్వండి

తొమ్మిది నెలలుగా బకాయిలు

ఇబ్బంది పడుతున్న క్లాప్ డ్రైవర్లు

గుంతకల్లుటౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): దాదాపు తొమ్మిది నెలల నుంచి వేతనాలు రాక క్లాప్ వాహన డ్రైవర్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జీతాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నవంబరు 1నుంచి క్లాప్ వాహనా లను డ్రైవర్లు నిలిపివేశారు. వైసీపీ ప్రభుత్వం క్లీన్ ఆంధ్రప్రదేశ్, జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా చెత్త సేకరణ కోసం క్లాప్ వాహనాలను తీసుకువచ్చింది. ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించడానికి 2022 మార్చిలో ప్రభుత్వం క్లాప్ వాహనాలను ప్రవేశపెట్టింది. రాయలసీమలో జోన్-3, 4 కింద 650 వాహనాలు మంజూరు చేశారు. ఈ వాహనాలకు డ్రైవర్లు, మెకానిక్, సూపర్‌వైజర్లను నియమించింది. పట్టణానికి 26 క్లాప్ వాహనాలు కేటాయించారు. ఒక్కో వాహన డ్రైవర్‌కు రూ.18,500లు, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పి విధుల్లోకి తీసుకున్నారు. అయితే వారికి ప్రస్తుతం రూ. 12లు మాత్రమే చెల్లిస్తున్నారు. మిగిలిన సొమ్ము, పీఎఫ్, ఈఎస్ఐను జీతంలో కట్ చేయడం లేదు. ప్రస్తుతం తొమ్మిది నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. డ్రైవర్లు తమకు రావాల్సిన వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ వంటి వాటి గురించి ప్రశ్నిస్తే 15 మందిని ఉద్యోగాల నుంచి తొలగించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో తమకు వేతన బకాయిలు వస్తాయని క్లాప్ డ్రైవర్లు ఎదురుచూస్తున్నారు. క్లాప్ డ్రైవర్లకు వేతనాలు చెల్లించాలని కౌన్సిల్ సమావేశంలో కమిషనర్, చైర్‌పర్సన్ దృష్టికి కౌన్సిలర్లు కూడా తీసుకెళ్లారు. ఈవిషయమై మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్‌ను వివరణ కోరగా ఏజెన్సీకి రూ.17లక్షలు, రూ.20లక్షలు చెల్లించాము. క్లాప్ డ్రైవర్లకు జీతాలు ఇచ్చేందుకు మాకు అధికారంలేదు. ఆడిట్ వాళ్లు అభ్యంతరం చెప్పారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామన్నారు.

జేఎన్‌టీయూకి స్నేహితుల సాయం

పేద విద్యార్థుల ఉపకార వేతనానికి రూ.5లక్షలు



ఇన్‌చార్జి వీసీకి చెక్కులను అందజేస్తున్న శ్రీరామచంద్ర

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ పూర్వ విద్యార్థి శ్రీరామచంద్ర, ఆయన స్నేహితుడు విజయ భాస్కర్ ఉదారత చాటుకున్నారు. జేఎన్‌టీయూ పేద విద్యార్థులకు ఉపకార వేతనం అందించేందుకు రూ.5 లక్షలు అందజేశారు. శ్రీరామచంద్ర జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో 1970లో మెకానికల్ ఇంజనీరింగ్ చదివారు. హైదరాబాద్‌లోని హెచ్ఎంటీలో ఉన్నత హోదాలో సేవలందించి రిటైర్ అయ్యారు. విజయభాస్కర్ వరంగల్ ఎన్ఐటీలో చదివి, హైదరాబాద్ హెచ్ఎంటీలో అసిస్టెంట్ మేనేజర్ హోదాలో రిటైర్ అయ్యారు. ఈ క్రమంలో తాను చదివిన జేఎన్‌టీయూకి సాయపడాలని అనుకుంటున్నాని శ్రీరామచంద్ర తన స్నేహితుడికి తెలిపాడు. రూ.2 లక్షలు ఇస్తానని చెప్పడంతో.. విజయ భాస్కర్ సైతం తానూ రూ.3 లక్షలు ఇస్తానని ముందుకొచ్చారు. ఈ మొత్తాలను చెక్కుల రూపంలో ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావుకు సోమవారం శ్రీరామచంద్ర అందజేశారు. రూ.5 లక్షలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామని, దానిపై వడ్డీని ఆర్థికంగా వెనుకబడ్డ విద్యార్థులకు ఏటా స్కాలర్‌షిప్‌గా అందజేస్తామని ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి తెలిపారు. కార్యక్రమలో శ్రీరామచంద్ర దంపతులు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య, డైరెక్టర్ సుజాత, రిటైర్డ్ ప్రొఫెసర్ శంకర్ పాల్గొన్నారు.

అనారోగ్యంతో గొంతు కోసుకున్న డ్రైవర్



బోయ నరసింహులు

గోరంట్ల, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరుమాళ్లపల్లికి చెందిన డ్రైవర్ బోయ నరసింహులు అనారోగ్యంతో మనస్తాపం చెంది సోమవారం గొంతుకోసుకుని, తీవ్రంగా గాయపడ్డాడు. చౌడప్ప కుమారుడైన నరసింహులుకు ఆదివారం వాంతులు కావడంతో చికిత్స చేయించారు. ఈ నేపథ్యంలో మనస్తాపం చెంది సోమవారం ఉదయం ఇంట్లోనే కొడవలితో గొంతు కోసుకుని, అస్వస్థతకు లోనయ్యాడు. వెంటనే అతడిని 108 వాహనంలో గోరంట్ల ఆస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యులు చికిత్స చేస్తుండగా నరసింహులు అరుస్తూ వింతగా ప్రవర్తించాడు. ఆరునెలల క్రితం కూడా ఇలాగే గొంతు కోసుకోవడానికి ప్రయత్నించాడని కుటుంబ సభ్యులు తెలిపారు. నరసింహులు మానసిక స్థితి సరిగా లేదనీ, మెరుగైన వైద్యం కోసం హిందూపురం ఆస్పత్రికి తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు.

బిడ్డలతో మహిళ అదృశ్యం







అనంతపురం క్రైం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా తనకల్లు మండలం కొక్కంటి క్రాస్‌కు చెందిన వెన్నెల.. నగరంలోని తన పుట్టింటికి వచ్చి అదృశ్యమయ్యారు. ఇద్దరు పిల్లలతో కలిసి ఆమె రెండు రోజుల క్రితం వెళ్లిపోయారు. దీంతో కుటుంబ సభ్యులు త్రీటౌన్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. కొక్కంటి క్రాస్‌కు చెందిన మనోహర్, వెన్నెల దంపతులకు ప్రదీప్, అక్షర సంతానం. గతనెల 20న వెన్నెల.. పిల్లలతో కలిసి అనంతపురం నగరంలోని ముత్యాలమ్మ కాలనీలోని పుట్టింటికి వచ్చారు.

అమాంతం పెరిగిన టమోటా ధరలు

అనంతపురం రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో టమోటా ధరలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. కొన్ని రోజులుగా కిలో గరిష్ఠ ధర రూ.30 నుంచి రూ.35 మధ్య పలుకుతూ వచ్చింది. సోమవారం కిలో పై రూ.5 పెరిగింది. కిలో గరిష్ఠంగా రూ.40తో అమ్ముడుపోయాయి. అలాగే సరాసరి రూ.35, కనిష్ఠ రూ.30 పలికినట్లు రాప్తాడు మార్కెట్ కమిటీ కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు 900 టన్నుల టమోటా దిగుబడులు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

చీనీ టన్ను రూ.28 వేలు

అనంతపురం రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 28,400 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 8వేలు, సరాసరి రూ.18వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 72టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

గౌరవం లేదు.. వేతనమూ లేదు..!

జీతాల కోసం ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీల ఎదురుచూపు

15 నెలలుగా అందని దుస్థితి



కొత్తచెరువు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో ఆర్థిక విధ్వంసం సాగించారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నారు. ప్రభుత్వోద్యోగులు, ఉపాధ్యాయులకు సమయానికి వేతనం అందింది లేదు. నెలాఖరులో ఇచ్చిన సందర్భాలు కోకొల్లలు. వేతన వెతలు ఉద్యోగులకే కాదు.. ప్రజాప్రతినిధులకూ తప్పలేదు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీలకు కూడా గౌరవ వేతనం 15 నెలలుగా అందలేదు. ఉమ్మడి జిల్లాలో 63 మండలాలున్నాయి. మండలానికి ఒకరు చొప్పున 63 మంది జడ్పీటీసీలు ఉన్నారు. వీరిలో ఒకరు మృతిచెందగా 62 మంది ఉన్నారు. 63 మంది ఎంపీపీలకుగాను ఇద్దరు పదవులకు రాజీనామా చేశారు. ఉమ్మడి జిల్లాలో 841 మంది ఎంపీటీసీలు ఉండగా.. ఇందులో 12 మంది మృతిచెందారు. ఇద్దరు పార్టీ మారారు. జడ్పీటీసీ, ఎంపీపీలకు గౌరవవేతనం నెలకు రూ.8 వేలు, ఎంపీటీసీలకు రూ.3 వేలు చొప్పున అందాల్సి ఉంది. గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీ, మండల పరిషత్‌ల అభివృద్ధిని అటకెక్కించింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను సైతం దారి మళ్లించింది. దీంతో ఎంపీపీలు, ఎంపీటీసీలకు అందాల్సిన గౌరవ వేతనం కూడా నిలిచిపోయిందని వారు వాపోతున్నారు.

ఆశలపై నీళ్లు

గత వైసీపీ హయాంలో పాలకుల దౌర్జన్యాలు పరాకాష్టకు చేరాయి. పోలీసులతో కలిసి స్థానిక సంస్థల ఎన్నికలను ఏకపక్షంగా నిర్వహిస్తున్నారని తెలుగుదేశం పార్టీ పరిషత్ బహిష్కరించింది. దీనితో ఎన్నికల బరిలో వైసీపీ మాత్రమే నిలిచింది. ఉమ్మడి జిల్లాలో 90 శాతం మందికిపైగా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగా వైసీపీ వారే ఎన్నికయ్యారు. అధికార పార్టీ ప్రజాప్రతినిధులమనీ, నిధులు దండిగా వస్తాయనీ, మండలాలు, గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేసుకోవచ్చని ఆనందపడ్డారు. వారి ఆశలపై అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు చల్లింది. పైసా కూడా నిధులు విదల్చలేదు. పైగా కేంద్రం ఇచ్చిన 15వ ఆర్థిక సంఘం ఇతరత్రా నిధులను సైతం దారి మళ్లించింది. దీంతో ఎంపీపీలు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు కన్న కలలన్నీ కల్లలయ్యాయి. నిధులు, పనుల సంగతి దేవుడెరుగు, చివరకు గౌరవ వేతనం కూడా దక్కలేదు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడం ద్వారానైనా సమాజంలో గౌరవం పొందవచ్చనుకున్నారు. ఆ అవకాశం కూడా ఇవ్వలేదు నాటి ప్రభుత్వం. వార్డు, గ్రామ వలంటీర్ల ద్వారా పథకాలను ప్రజలకు అందజేశారు. దీంతో గౌరవం, గౌరవ వేతనం రెండూ లేకుండా పోయాయని వారు వాపోతున్నారు.

ఆఫీసులకు రాం.. రాం..

రాష్ట్రంలో పాలకపక్షం మారడంతో చాలా మండలాల్లో ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు ప్రభుత్వ కార్యాలయాలకు రావడమే తగ్గించేశారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావడంలేదని తెలుస్తోంది. ఆ దరిదాపుల్లోకే వారు రావట్లేదు. ఇటీవల కూటమి ప్రభుత్వం కొలువుదీరాక పల్లెల్లో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పుడైనా గౌరవ వేతనం అందుతుందా అని స్థానిక సంస్థల ప్రతినిధులు ఆశగా చూస్తున్నట్లు తెలుస్తోంది.

త్వరలోనే ఖాతాలకు జమవుతుంది

ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీలకు గౌరవ వేతనానికి సంబంధించి ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరి వరకు వేతనం మంజూరు చేసింది. బిల్లు పెట్టాం. త్వరలోనే వారి ఖాతాలకు జమవుతుంది. ఇంకా.. పది నెలల గౌరవ వేతనం ప్రభుత్వం నుంచి మంజూరు కావాల్సి ఉంటుంది.

-వెంకటసుబ్బయ్య, జడ్పీ సీఈఓ

ఆమె బాగుంటేనే..

- కలెక్టరు వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): 'ఆమె బాగుంటేనే మనమంతా బాగుంటాం. మహిళలు, బాలికలను సంరక్షించడం నవ సమాజ నిర్మాణానికి పునాది' అని కలెక్టరు వినోద్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో మహిళలపై హింస వ్యతిరేక అంతర్జాతీయ పక్షోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆయన సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ మహిళలు, బాలికలపై హింస జరగ కుండా ఉండేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చట్టాలు తీసుకువచ్చినట్లు తెలిపారు. ఆచట్టాలను పక్కాగా అమలు చేసేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. మహిళలు, బాలికల ప్రాధాన్యం ప్రజలకు తెలియజేస్తూ వారిని గౌరవించేలా చైతన్యం తీసుకురావాలన్నారు. మహిళలపై హింసలేని జిల్లాగా అనంతను మారుద్దామని కలెక్టరు పిలుపునిచ్చారు. అనంతరం అధికారులతో ప్రతిజ్ఞ చేయించి, సంతకాలు చేయించారు. కార్యక్రమంలో జేసీ శివనారాయణశర్మ, అసిస్టెంట్ కలెక్టరు వినూత్న, డీఆర్ఓ మలోల, ఐసీడీఎస్‌పీడీ శ్రీదేవి, బీసీ సంక్షేశాఖాధికారి కుష్బూకొఠారి వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మతోపాటు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

తహసీల్దార్ భరత్ మృతికి సంతాపం

మూడురోజుల కిందట మృతి చెందిన తహసీల్దార్ భరత్‌కు కలెక్టరేట్‌లో సోమవారం సంతాపం తెలిపారు. ఆయన చిత్రపటానికి కలెక్టరు, జేసీ, డీఆర్ఓ తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడుతూ భరత్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

సార్..! మా డబ్బులు ఇప్పించండి

అప్పుగా తీసుకుని ఇవ్వకుండా బెదిరిస్తున్నారు

ఎస్పీకి బాధితుల ఫిర్యాదు



ఎస్పీని కలిసి బయటకు వస్తున్న బాధితులు

అనంతపురం క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వడ్డీకి ఆశపడి ఓ కుటుంబానికి కొంతమంది రూ.లక్షల్లో డబ్బులు అప్పుగా ఇచ్చారు. అలా అందరూ కలిపి రూ.కోట్లు ముట్టజెప్పారు. ఆ తండ్రీ కొడుకులేమో మూడేళ్లుగా అసలు, వడ్డీ కట్టకుండా బెదిరింపులకు దిగుతున్నారని బాధితులందరూ జిల్లా పోలీస్ కార్యాలయానికి వచ్చారు. ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా ఎస్పీ జగదీష్‌ను కలిసి సమస్యను విన్నవించుకున్నారు. అనంతరం వారు విలేకరులతో ఆవేదన వెలిబుచ్చారు. నగరంలోని రెండో రోడ్డుకు చెందిన హోసూరు మల్లికార్జున, అతడి భార్య రాజేశ్వరి, హోసూరు రాఘవేంద్ర, అతడి భార్య మంజుల ఇంటి నిర్మాణం, స్థిరాస్తుల అభివృద్ధి, కుటుంబ అవసరాల కోసం తమతో డబ్బు అప్పుగా తీసుకున్నారన్నారు. రూ.లక్ష మొదలుకొని రూ.10లక్షల వరకు ఇచ్చామన్నారు. మూడేళ్లయినా వడ్డీ కట్టలేదన్నారు. అసలు వడ్డీ కలిపి రూ.8కోట్లు ఇవ్వాల్సి ఉందన్నారు. అందరం నిలదీయడంతో ఆర్థిక ఇబ్బందులతో చెల్లించలేమని రూ.4.5 ఆస్తి ఉందని, మీరే ఎవరినైనా కొనుగోలుదారుని పిలుచుకొస్తే విక్రయిస్తామని ఒప్పుకున్నారన్నారు. ఎవరినైనా తీసుకెళ్తే అసభ్య పదజాలంతో దూషిస్తూ, బెదిరించడంతోపాటు దాడులకు దిగుతున్నారని ఆరోపించారు. రాఘవేంద్ర ఎవరెవరి పేర్లో చెప్పి బెదిరిస్తున్నాడన్నారు. కనీసం అసలైనా ఇవ్వమంటున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఎస్పీని కలిసిన వారిలో పార్థసారథి, బాషా, బయపరెడ్డి, నారాయణస్వామి, రవిచంద్ర, రామాంజినమ్మ, లక్ష్మీదేవి ఉన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



రైతు నాగరాజు (ఫైల్)

గార్లదిన్నె, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో అప్పుల బాధ తాళలేక రైతు నాగరాజు (28) సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామానికి చెందిన తిరుపాల్, సుంకమ్మ దంపతులు కుమారుడు నాగరాజు వ్యవసాయ పనులు చేసుకుంటు తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉండేవాడు. పంటల సాగుకోసం చేసిన అప్పులు అధికం కావడంతో వారికున్న నాలుగు ఎకరాల పొలంలో మూడెకరాలను గతంలోనే అమ్ముకున్నారు. ఉన్న ఎకరా పొలంలో చీనీచెట్లు సాగుచేసుకుని జీవనం సాగించేవారు. నాగరాజు పొలం పనులతో పాటు ట్రాక్టర్ కొనుగోలు చేసి గ్రామంలో అద్దెకు తిప్పేవాడు. పంట దిగుబడి రాక, వచ్చినా పంటకు గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోయారు. దీంతో అప్పులు సుమారు రూ.15 లక్షల వరకు పెరిగాయి. అప్పులు ఎలా తీర్చేదంటూ తరచూ మథనపడేవాడు. ఈక్రమంలోనే తీవ్ర మనస్తాపంతో సోమవారం తెల్లవారుజామున తోట వద్దకి వెళ్లి అక్కడే చెట్టుకు ఉరి వేసుకున్నాడు. ఉదయం గమనించిన చుట్టుపక్క పొలాల రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శింగనమల సర్కిల్ సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలను కుటుంబ సభ్యులతో అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కరెంట్ కష్టాలు..!

- కనెక్షన్ల కోసం రైతుల ఎదురుచూపు
- రూ. లక్షలు చెల్లించినా ఏళ్ల తరబడి నిరీక్షణ
- పట్టించుకోని అధికారులు, పాలకులు



రైతుల ఇళ్ల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు



దిష్టిబొమ్మల్లా ఉన్న స్తంభాలు

గాండ్లపెంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తమది రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకోవడం తప్పా.. ఏ ప్రభుత్వమూ వారి సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయలేదు. కరువు జిల్లాలో వర్షాలపై ఆధారపడి పంటలు పండించే కాలాలు ఎప్పుడో పోయాయి. దీంతో మెట్ట భూముల్లో బోర్లు వేయించుకుని పంటల సాగు చేయడం వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఎన్నో వందలు అడుగులు బోరు వేస్తేనే నీరు పడటం గగనం. వారి అదృష్టం బాగుండి.. నీరు పడిన రైతులు.. ఆ బోర్లకు మోటార్లు ఏర్పాటు చేసుకున్నారు. వాటికి విద్యుత్ కనెక్షన్ల కోసం సంవత్సరాల క్రితమే రూ. లక్షలు చెల్లించి డీడీలు తీశారు. అయితే విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆ బోర్లకు నేటికీ కనెక్షన్ ఇవ్వలేదు. ప్రభుత్వాలు, నాయకులు మారినా తమ కష్టాలు మాత్రం తీరడం లేదని వాపోతున్నారు.

● వైరు లేక..: పలువురు రైతులు నూతనంగా బోరు బావులు తవ్వించు కున్నారు. ఏడాది క్రితం నుంచి 14 పంచాయతీల్లో దాదాపు 50మంది కరెంటు కోసం ట్రాన్స్‌కో అధికారుల ప్రణాళిక మేరకు డీడీలు చెల్లించారు. వారిలో కొందరికి కరెంటు పరికరాలు.. మరికొందరికి ట్రాన్స్‌ఫార్మర్లు.. విద్యుత్ స్తంభాలు అందించారు. మరికొంతమంది రైతులకు అసలు ఏమీ ఇవ్వలేదు. ముఖ్యంగా రైతులకు కరెంటు కనెక్షన్ ఇవ్వాలంటే అల్యూమినియం వైరు లేదు. ఏడాదిగా అది స్టాక్ రాలేదు. దీంతో రైతులకు కరెంటు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఇచ్చినా, ఫలితం లేకుండా పోయింది. ఎప్పుడు అల్యూమినియం వైరు ఇస్తారా అని రైతులు ఎదురు చూస్తున్నారు.

● దిష్టిబొమ్మల్లా స్తంభాలు: కరెంటు కనెక్షన్ కోసం డీడీలు చెల్లించిన రైతులకు అధికారులు కరెంటు స్తంభాలు ఇచ్చారు. వాటిని రైతులే సొంత ఖర్చుతో నాటుకున్నారు. అయితే అల్యూమినియం వైర్లు రాకపోడంతో అవి దిష్టిబొమ్మలా మిగిలిపోయాయి. ఎప్పుడు స్తంభాలకు వైర్లు లాగి కరెంటు ఇచ్చారా అని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. అధికా రులు మాత్రం రేపు.. మాపు.. అంటూ కాలయాపన చేస్తూనే ఉన్నారు.

● ఇళ్లవద్దే ట్రాన్స్‌ఫార్మర్లు : మండలంలో కరెంటు కనెక్షన్ కోసం దరఖాస్తు చేస్తున్న కొంతమంది రైతులకు అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లను అందించారు. అయితే వాటికి అల్యూ మినియం వైర్లు రాకపోవడంతో పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు ఉంచితే దొంగలు ఎత్తుకెళ్తారనే భయంతో ఇళ్లవద్దనే ఉంచుకు న్నారు. పంటలకు నీరు అందక ఎండిపోతున్నాయి. ఒక రైతుకు ఒక కరెంటు కనెక్షన్ అసరమైతే.. రెండు కనెక్షన్లకు అధికారులు డబ్బులు కట్టించుకున్నారు. అయినా ఒక కనెక్షన్ కూడా ఇవ్వలేదు. దీనిపై ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసులు వివరణ కోరగా 'ఉన్నతాధికారుల నుంచి అల్యూ మినియం వైర్ అందలేదు. కొంతమంది రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు ఇచ్చాం. అల్యూమినియం వైర్లు వచ్చిన వెంటనే కరెంటు కనెక్షలు ఇస్తాం.' అని అన్నారు.


ఏడాది క్రితమే డీడీ తీశాం



నేను నూతన కరెంటు కనెక్షన్ కోసం 2023 సెప్టెంబరులో డీడీలు తీసి అధికారులకు అందించాం. వారు ట్రాన్స్‌ఫార్మర్, స్తంభాలు అందించారు. అల్యూమినియం వైర్ స్టాక్ లేదని ఇంతవరకూ కాలయాపన చేస్తున్నారు. కరెంట్ లేకపోవడంతో పంటలు పండించలేకపోతున్నా.

-ప్రతాప్, రైతు, వంకపల్లి

వైర్ ఎప్పుడు ఇస్తారో..?



ఎంతో ఆశలో కరెంటు కోసం డబ్బులు చెల్లించాను. సంవత్సరం అయింది. లోవోల్టేజీ సమస్య ఎక్కువగా ఉంది. మోటార్లు కాలిపోతున్నాయి. ఏడాది నుంచి ఎలాంటి ట్రాన్స్‌ఫార్మర్లు అమర్చలేదు. రైతులు డబ్బులు చెల్లించినా ఫలితం లేదు. వేసవిలో సాగుచేసిన పంటలు ఎండిపోయాయి. డీడీలు చెల్లించిన ప్రతి రైతుకు కరెంటు కనెక్షన్ ఇవ్వాలి.

- పాపిరెడ్డి, రైతు, వంకపల్లి

న్యూస్ బాక్స్ ...

రూ.1.18 కోట్లతో హాస్టళ్లకు మరమ్మతు

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్

ధర్మవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ధర్మవరం నియోజకవర్గంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల మరమ్మతులకు రూ.1.18 కోట్లు మంజూరైనట్టు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని తాడిమర్రి బాలుర వసతిగృహం, ధర్మవరంలోని బాలుర వసతి గృహం, బాలికల వసతి గృహ భవనాలు శిథిలావస్థలో ఉండటంతో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా వీరాంజనేయస్వామి దృష్టికి తీసుకెళ్లి భవనాల మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయించినట్లు వివరించారు. ధర్మవరం ప్రాంతంలో విద్యాభివృద్ధి కోసం త్వరలో మరిన్ని కార్యక్రమాలు చేపడుతానని హామీ ఇచ్చారు.

శ్రీవారి ఆర్జిత కల్యాణోత్సవ తేదీలివే ..

కదిరి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామికి ఈ నెలలో నిర్వహించే ఆర్జిత కళ్యాణోత్సవాలను తేదీలను ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3, 4, 5, 6, 8, 9, 10, 11 12, 13, 15, 17, 18, 19, 20, 22, 23, 24, 25, 27 తేదీల్లో ఆర్జీత కళ్యాణత్సవాలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. మరిన్ని వివరాలకు 08494 - 221066, 221366కు ఫోన్‌కు ఆలయ పనివేళల్లో సంప్రదించాలని సూచించారు.

చట్టాలపై అవగాహన

తనకల్లు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక కేజీబీవీలో ఎస్ఐ గోపి ఆధ్వర్యంలో విద్యార్థినులకు పలు చట్టాలపై సోమవారం అవగాహన కల్పించారు. పోక్సో, నేరాలు, సైబర్ క్రైం, డ్రగ్స్, ఉమేన్ ట్రాఫికింగ్, గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

● నంబులపూలకుంట: మండలంలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు రూరల్ సీఐ నాగేంద్ర సోమవారం పలు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ వలీబాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీధిదీపాలు ఏర్పాటు చేయండి

నల్లమాడ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక అక్కమ్మ స్ట్రీట్‌లో వీధిదీపాలు, సీసీ రోడ్డు వేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఈఓఆర్డీ అమర్‌నాథ్‌రెడ్డికి వినతి పత్రం అందజేసిన వారు మాట్లాడారు. పంచాయతీ నీరు సక్రమంగా అందలేదని, ఈ సమస్యలపై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం గోవిందు, రమేష్, సూరయ్య, రామక్రిష్ణ, శివరామయ్య బాలాజీ నాయక్ పాల్గొన్నారు.

కాలుష్య నివారణ దినోత్సవం

కదిరి అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక హరీష్ పాఠశాలలో కాలుష్య నివారణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఎంఎస్ కిరణ్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇందులో కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

హెచ్‌ఎంపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

నంబులపూలకుంట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మడకశిర మండలం ఆముదాల గొంది జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు జబేజ్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. పాఠశాలలో 8వ తరగతి చదువుకుంటున్న చేతన్‌ను విరామ సమయంలో మేనమామ తీసుకెళ్ల హత్య చేయడం దారుణమైనచర్య అన్నారు. ఈ విషయంలో ఎంటువంటి సంబంధంలేని ప్రధానోపా ధ్యాయుడ్ని సస్పెండ్ చేయడం, పీఈటీ ప్రసూనాకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం సరికాదన్నారు. మానవతా దృక్పదంతో ఆ సస్పెన్షన్, షోకాస్ నోటీసు ఉపసంహరించాలని కోరారు.

● కొత్తచెరువు : మడకశిర మండలం ఆమిదాలగొంది హెచ్‌ఎంను సస్పెండ్ చేయడం తగదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఘటనకు హెచ్‌ఎంను బాధ్యులు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా హెచ్‌ఎం సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని విజ్ఞప్తిచేశారు.

హిందూ శంఖారావాన్ని విజయవంతం చేద్దాం

తనకల్లు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): విజయవాడలో గురువారం నిర్వహించే హైందవ శంఖరావం కార్యక్రమంలో హిందూవులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు కోరారు. మండలంలోని కొక్కంటిక్రాస్‌లోని శ్రీరామదేవాలయంలో సోమవారం నిర్వహించిన హిందూ సమ్మేళనంలో వారు ఆ సభకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు రామచంద్ర, గంగారాజు, దూర్జడి లక్ష్మీనరసింహ పాల్గొన్నారు.

అనర్హులకు పింఛన్లు రద్దు చేయాలి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న అఖిలపక్ష నాయకులు

తనకల్లు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో అనేక మంది అనర్హులకు మంజూరు చేసిన పింఛన్లను వెంటనే రద్దు చేయాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం అధికారులు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎంపీడీఓ రెడ్డెప్ప కు వినతిపత్రం అందజేసిన వారు మాట్లాడారు. మండలంలోని 17 పంచాయతీల్లో అనర్హులకు నాటి వైపీసీ పాలకులు పింఛన్లు మంజూరు చేసినట్లు ఆరోపించారు. నెలకు రూ. లక్ష వేతనం వస్తున్న వారికి, ఇన్‌కం ట్యాక్స్ చెల్లిస్తున్న వారికి పింఛన్లు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. అసలైన అర్హులకు, వికలాంగులు, వితంతువులు, అనాథలకు పింఛన్ల రద్దు చేయడంతో వారు నేటికీ కార్యాలయాల చుట్టుప్రదక్షిణలు చేస్తున్నారన్నారు. అన్ని పంచాయతీల్లో విచారణ నిర్వహించాలని అనర్హులను తొలగించి.. అర్హులకు పింఛన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.కార్యక్రమంలో కాంగ్రెస్ తోపు పారేసు, సీపీఎం శివన్న, సీఐటీయూ వేమన్న, రైతు సంఘం రమణ, వివి రమణ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ధర్మవరం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 104 కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ పేర్కొన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.... రాష్ట్రవ్యాప్తంగా 104 ఉద్యోగులు దాదాపు నెల రోజులుగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఆ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, రెగ్యులర్ చేయాలని, ప్రతినెల వేతనాలు ఇవ్వాలని, వాహనాల రిపేర్లు ప్రభుత్వమే చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీఐటీయూ మండల కో-కన్వీన ర్‌లు అయూబ్‌ఖాన్, ఎల్ ఆదినారాయణ, జంగమన్న పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చండి



రోడ్డుపై ఏర్పడిన గుంత

నంబులపూలకుంట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సత్యసాయి, అన్నమయ్య జిల్లా సరిహద్దులోని రోడ్డుపై గుంతలు అధికంగా ఏర్పడ్డాయని, దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, ఆ గుంతలు పూడ్చేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు. నంబులపూలకుంట నుంచి అన్నమయ్య జిల్లా సరిహద్దు వరకు ఉన్న మూడు కిలోమీటర్ల రోడ్డు.. చాలా శిథిలావస్థకు చేరుకుం దన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు నిలుస్తుండటంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

అంతర్‌జిల్లా రగ్బీ పోటీల్లో
రన్నరప్‌గా జిల్లా జట్లు

కావలిటౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా కావలి పట్టణంలోని మద్దూరుపాడులోగల డీబీఎస్ ఇంజనీరింగ్ కళాశాల క్రీడా ప్రాంగణంలో రెండురోజులపాటు జరిగిన సబ్‌జూనియర్ అంతర్ జిల్లాల రగ్బీ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీలకు రాష్ట్రంలోని 14 జిల్లాల నుంచి బాల,బాలికల జట్లు హాజరయ్యాయి. కర్నూలు జిల్లా బాలుర, బాలికల జట్లు అత్యున్నత ప్రతిభ కనబరిచి ఓవరాల్ చాంపియన్లుగా నిలిచాయి. బాలుర విభాగంలో రన్నరప్‌గా శ్రీసత్యసాయి జిల్లా జట్టు, తృతీయస్థానంలో నెల్లూరు జట్టు నిలిచాయి. బాలికల విభాగంలో రన్నరప్‌గా శ్రీసత్యసాయి జిల్లా, తృతీయ స్థానంలో కృష్ణా జట్టు నిలిచాయి. ముగింపు సభలో ముఖ్య అతిథిగా డీబీఎస్ కళాశాల కరస్పాండెంట్ దామిశెట్టి సుధీర్ నాయుడు పాల్గొని విజేతలకు కప్పులు, మెడల్స్, ప్రశంసా పత్రాలు అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల రగ్బీ పోటీలకు తమ కళాశాల వేదికవడం సంతోషంగా ఉందన్నారు. రగ్బీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడుతూ జిల్లా కేంద్రాల్లోనే రగ్బీ పోటీల నిర్వహణకు వెనుకాడతామని, అలాంటిది కావలిలోని డీబీఎస్ యాజమాన్యం ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టీవీ రావు, పీడీ మురళి, వివిధ జిల్లాల నుంచి వచ్చిన రగ్బీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి నిధులివ్వండి



కేశవ్‌తో గోనుగుంట్ల భూషణ్

తాడిమర్రి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల అభివృద్ధికి నిధులు విడుదల చేయాలని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను సర్పంచుల సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్ విజ్ఞప్తి చేశారు. సోమవారం అనంతపురంలోని మంత్రి స్వగృహంలో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. స్పందించిన మంత్రి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత గ్రామ పంచాయతీల అభివృద్ధికి రెండు విడతల్లో నిధులు అందించామని, ఇక ఆర్థిక సంఘం నిధులను కూడా అందజేస్తున్నట్టు పేర్కొన్నారు.

ఇసుక టిప్పర్ల స్వాధీనం

బత్తలపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మల్లకుంట వద్ద మూడు ఇసుక టిప్పర్లను సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. మండలంలోని రామాపురం సమీపంలోని చిత్రవతి నది నుంచి ఇసుక తరలిస్తుండగా... గుమ్మల్లకుంట క్రాస్ వద్ద వాటిని స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశామని తెలిపారు.

యువతి అదృశ్యం

తనకల్లు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి ఆదివారం రాత్రి అదృశ్యమైనట్లు ఆమె తండ్రి సోమవారం తమకు ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ గోపీ తెలిపారు. ఆ యువతి ఆదివారం రాత్రి ఇంటిలో నుంచి బయట వెళ్లి.. తిరిగి రాలేదని, దీంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో గాలించినా ఫలితం లేకుండా పోయిందని తెలిపారు. దీంతో ఆ యువతి తండ్రి తమకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

అనారోగ్యంతో కార్మికుడి మృతి

నల్లమాడ డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన నాగభూషణం (46) అనారోగ్యంతో సోమవారం మరణించాడు. ఇతను సత్యసాయిబాబా వాటర్ స్కీం ఆవిర్భావం నుంచి కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మూడు రోజుల క్రితం జ్వరం రావడంతో కదిరికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం వెళ్లగా, అక్కడ నుంచి బెంగుళూరుకు వెళ్లారు. అక్కడ వైద్యులు కర్నూల్‌కు రేఫర్ చేయడంతో కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మరణించాడు. అతనికి భార్య వరాలమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమారుడు ఉన్నారు.

మండల కమిటీ ఏకగ్రీవం

ఓబుళదేవరచెరువు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు మండల కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కార్యవర్గ సభ్యులు వసంతం భుజగరావు, ఖాజీ సాదిక్‌వలీ ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. మండ లాధ్యక్షుడిగా షాజహాన్‌బాషా, ప్రధాన కార్యదర్శిగా ఎం. రంగప్ప, ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా ఆదిమూర్తి, గౌరవ సలహాదారుడిగా టిన్ను మల్లికార్జునరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా కొవ్వూరి విశ్వనాథ్‌రెడ్డి, జి.బాబా, డి. మహబూబ్‌బాషాను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని ఎంపీడీఓ రాబర్టు విల్సన్, తహసీల్దార్ అనంతాచారి, గిరిజన సంఘం నాయకులు శ్రీనివాసులనాయక్ అభినందించారు.



ఏపీయూడబ్ల్యూజే మండల కమిటీ

అన్నదాతపై జీఎస్టీ భారం

పురుగు మందులు, ఎరువులపై కూడా విధింపు .. తొలగించాలని రైతుల వినతి

కొత్తచెరువు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కరువు జిల్లాలో అతి వృష్టి, అనావృష్టి వల్ల పంటలు పం డక రైతులు అప్పుల పాలు అయ్యారు. కుటుంబాన్ని పోషించలేక.. అప్పులు చెల్లించే మార్గం కానరాక అనేక మంది అత్మహత్య చేసుకున్నారు... చేసుకొంటూనే ఉన్నారు. వారిని ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం.. వ్యవసాయ రంగంపై ఏటా దాదాపు రూ. 100 కోట్ల జీఎస్టీ భారం మోపింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 12 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఇందులో ముఖ్యంగా వేరుశనగ, వరి, మొక్కజొన్న, ఉద్యానవన పంటలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 50 శాతానికి పైగా ప్రజలు వ్యవసాయం రంగం ద్వారా ఉపాధి పొందుతున్నారు. అయితే పంటలు చేతికి రాక.. వచ్చినా గిట్టుబాటు ధర లేక రైతులు అప్పుల పాలు అవుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించి ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం ఈ వ్యవసాయ రంగంపై ఏటా దాదాపు 100 కోట్ల జీఎస్టీ భారం వేయడంతో రైతులు వ్యవసాయాన్ని వదిలేసి.. నగరాలకు వలస వెళ్తున్నారు. అన్నదాతలకు అండగా ఉండాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీని వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, పురుగు మందులపై వేసి.. రైతు నడ్డివిరుస్తోందన్నారు.

● 2017 నుంచే అమలు

కేంద్రప్రభుత్వం 2017లో జీఎస్టీ అమల్లోకి తెచ్చింది. అప్పటి నుంచి క్రిమిసంహారక మందులు, డ్రిప్ పరికరాలు, వ్యవసాయ యంత్ర పరికరాలపై 18 శాతం జీఎస్టీ వసూలు చేస్తోంది. విత్తనాలపై జీఎస్టీ మినహాయింపు, ఎరువులపై మాత్రం జీఎస్టీని ఐదు శాతానికి పరిమితం చేసింది. ఇక మిగిలిన వ్యవసాయ రంగానికి సంబంధించిన వాటిపై జీఎస్టీ విధించింది.



ఎరువుల దుకాణం

గతంలో పన్ను మాత్రమే ఉండేది



పది సంవత్సరాల క్రితం ప్రతి వస్తువుపై ట్యాక్స్ (పన్ను) మాత్రమే ఉండేది. అది కూడా ఎరువులు, పురుగుమందులు, యంత్ర పరికరాలపై నామమాత్రంగా పన్ను ఉండేది. పన్ను రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉండడంతో ధరలు కూడా తక్కువగా ఉండేవి. వ్యవసాయం కూడా లాభసాటిగా ఉండేది. కేంద్రప్రభుత్వం జీఎస్‌టీని అమలు చేయడంతో ప్రతి వస్తువుపై 18 శాతం విధిస్తోంది. ఫలితంగా ఏటా 10 శాతం ధరలు అదనంగా రైతులపై పడుతోంది. దీంతో రైతులకు వ్యవసాయం భారంగా మారుతోంది.

-చంద్రశేఖర్, రైతు, బండ్లపల్లి

జీఎస్టీ తొలగించాలి



ఎరువులు, పురుగుల మందులు, యంత్ర పరికరాలపై జీఎస్టీ ప్రభావంతో ఏటా వ్యవ సాయంపై ఖర్చులు భారం పెరుగుతోంది. పంటలు సాగు చేయాలంటేనే బయపడే పరి స్థితి నెలకొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా పునరాలోచించి జీఎస్టీ పరిధి నుంచి వ్యవసాయాధారిత ఉపకరణాలను, ఎరువులు, పురుగుమందులను మినహాయించాలి. లేకపోతే ఎక్కువ శాతం మంది రైతులు సాగుకు దూరమయ్యే ప్రమాదం ఉంది.

-శ్రీనివాస్ రెడ్డి, రైతు, దంట్లపల్లి

సాగుచేస్తే నష్టపోవాల్సిందే



ప్రస్తుతం రుతువులకు అనుగుణంగా వర్షాలు పడలేదు. వర్షాలు కురిసిన వ్పుడు పంటలు పెడితే పంటకు కొత్తకొత్త తెగుళ్ల, చీడపీడలు సోకుతు న్నాయి. దీంతో తెగుళ్ల నివారణకు పురుగు మందులను అధికంగా వాడాల్సి వస్తోంది. దీంతో పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయి. అధికంగా మందులు కొట్టడం వల్ల పంట దిగుబడి, నాణ్యత తగ్గుతోంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో సాగు చేస్తే నష్టాలు తప్పడం లేదు.

- కెంపుల బాబు, రైతు, కొత్తచెరువు

వర్షం రాకతో వరి రైతుల్లో ఆందోళన

గాండ్లపెంట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాలతో వరి రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల వ్యాప్తంగా ఖరీఫ్‌లో దాదాపు 1500 ఎకరాలకు పైగా వరి పంటను సాగుచేశారు. ప్రస్తుతం వరిపంట కోత దశలో ఉంది. కొంతమంది రైతులు పంటను కోసి.. పొలాల్లో ఉంచారు. మరికొంత మంది పంట కోతకు సిద్ధమయ్యారు. ఈ సమయంలో నాలుగు రోజుల నుంచి తుఫాన్ ప్రభావంతో వర్షాలు పడుతుండటంతో రైతులు అయోమయంలో పడ్డారు. కోసిన వరి పంట ఎక్కడ మొలకలు వస్తాయోనని, పంట కోయని రైతులు వర్షానికి పంట మొత్తం రానిపోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరి పంట సాగుచేయడానికి ఎకరాకు సుమారు రూ.30 వేలు ఖర్చు చేశారు. చేతికొచ్చిన సమయంలో ఎక్కడ అందకుండాపోతాయే అని ఆందోళన చెందుతున్నారు. కోసిన రైతులకు కనీసం గ్రాసం కూడా దక్కకుండా పోయే ప్రమాదముంది.



కోతకు వచ్చిన వరి పంట

సంక్షిప్తం

కర్ణాటక మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యాన్ని చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

పెనుకొండ/గోరంట్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గోరంట్ల మండలం పాలసముద్రం క్రాస్‌వద్ద దాడులు నిర్వహించి రూ.80వేలు విలువచేసే కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ సృజన్‌బాబు తెలిపారు. సోమవారం ఉదయం పాలసముద్రం గ్రామంలో తిప్పన్న అనే వ్యక్తి ఇంటి పరిసరాల్లో తనిఖీలు నిర్వహించగా 20 బాక్సుల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ రూ.80వేలు ఉంటుందన్నారు. ఈ దాడుల్లో ఎస్‌ఐలు రాజశేఖర్, రాముడు, హెడ్ కానిస్టేబుల్ జనార్దన్, రమేష్, ఈసీ ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఇసుక రవాణాకు అనుమతులు తప్పనిసరి

పరిగి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉచితంగా ఇసుకను పొందేందుకు స్థానిక ప్రజలు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ హసీనాసుల్తానా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూపన్ డౌన్‌లోడ్ చేసుకున్న 24 గంటల్లో మండలంలోని స్థానిక వాగులు, వంకల్లో ఇసుకను ఉచితంగా తరలించుకోవచ్చన్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుని వాహనాలను సీజ్ చేస్తామన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ

రొళ్ల, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రొళ్ల మండలంలోని అలుపనపల్లి ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎంఈఓ శ్రీధర్ తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులతో ఎంఈఓ మాట్లాడుతూ 7వతేదీ జరగబోయే మెగా పేరెంట్స్ మీటింగ్‌కు విద్యార్థుల తల్లిదండ్రులకు ఆహ్వానం పంపాలని సూచించారు. అనంతరం పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు ఉన్నారు.

5 నుంచి ఉచిత శిక్షణ

పెనుకొండ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 5నుంచి రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కేశవరావు తెలిపారు. పది, ఇంటర్, డిగ్రీ ఆపై చదివిన యువతీ యువకులు అర్హులన్నారు. శిక్షణ అనంతరం వీరికి సర్టిఫికెట్లతోపాటు మంచి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9676706976 ను సంప్రదించవచ్చన్నారు.

మహిళలకు బ్యూటీషియన్ కోర్సులో..

హిందూపురం అర్బన్ : స్థానిక బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో మహిళలకు ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 3 నెలల పాటు బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ హరీష్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ ఇస్తామన్నారు. ఈనెల రెండో వారంలో తరగతులు ప్రారంభమవుతాయన్నారు. 18 సంవత్సరాల పైబడి 35 సంవత్సరాల లోపు యువతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9704778737ను సంప్రదించాలన్నారు.

వాహన్ యాప్ ద్వారానే రవాణా సేవలు

హిందూపురం అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇక నుంచి రవాణా సేవలన్నీ వాహన్ యాప్ ద్వారా చేసుకోవాలని రవాణా శాఖ అధికారి కరుణాసాగర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇంతకు ముందు ఈ ప్రగతి యాప్ ద్వారా ప్రజలు రవాణా సేవలు పొందేవారన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ఒకే రకంగా సేవలు అందించాలనే ఉద్దేశ్యంతో వాహన్ యాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఈ ప్రగతి యాప్ ఇక పనిచేయదన్నారు. మంగళవారం నుంచి వాహన్ యాప్‌లోనే సేవలు పొందాలన్నారు.

కోనాపురం రోడ్డుకు మరమ్మతులు

పెనుకొండ రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాపురం వెళ్లే రహదారిలో కూటమి నాయకులు తాత్కాలికంగా రోడ్డు మరమ్మతులు చేపట్టారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు మడకశిర రోడ్డు నుంచి కోనాపురం వెళ్లే రహదారిలో భారీగా వర్షపునీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత దృష్టికి తీసుకెళ్లడంతో మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసులుకు తాత్కాలిక మరమ్మతులు చేయించాలని ఆదేశాలు జారీచేశారు. దీంతో కమిషనర్, టీడీపీ నాయకులు శ్రీరాములు యాదవ్, రఘువీరచౌదరి, రామలింగ, నంజుండ, చంద్రశేఖర్ కలిసి కోనాపురం రోడ్డులో నిలిచి ఉన్న వర్షపు నీటిని ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించి యుద్ధప్రాతిపదికన చర్యలుచేపట్టారు.

ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి

మడకశిరటౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని, గ్రామ స్థాయిలో ప్రజల్లో అవగాహన పెంపొందించాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఎన్‌ఎస్‌ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల నుంచి ప్రధాన కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి హేమలత, డాక్టర్ ఎస్.అనిల్‌కుమార్, రెడ్‌రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ నాగసాయిప్రసాద్ పాల్గొన్నారు.

పెనుకొండ : ఎయిడ్స్ రహిత సమాజమే ధ్యేయంగా ఉండాలని, అందుకోసం ప్రతి పౌరుడు కృషిచేయాలని ప్రిన్సిపాల్ కేశవరావు తెలిపారు. సోమవారం డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ సోకిన వారిని దూరంగా ఉంచరాదని, వారిపట్ల ప్రేమ అభిమానంతో మెలగాలన్నారు. ఈ వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయప్ప మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి వ్యాధి సోకకుండా చర్యలు తీసుకోవడం ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఐక్యూ కోఆర్డినేటర్ యశోదరాణి, ఎన్‌ఎస్‌ఎస్‌పీఓ కాంతరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మోస్తరు వర్షం

మడకశిరటౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ వ్యాప్తంగా సోమవారం ఉదయం నుంచి ఓ మోస్తారు వర్షం కురుస్తోంది. వారం నుంచి చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. ఆదివారం రాత్రి మడకశిర మండలంలో 10.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. అదేవిధంగా అమరాపురం మండలంలో 6.2 మి.మీ., గుడిబండలో 8.8 మి.మీ., రొళ్లలో 10.4 మి.మీ., అగళిలో 3 మి.మీ. వర్షపాతం నమోదయింది. ఓ మోస్తారు వర్షం కురుస్తుండటంతో రోడ్లపై నీరు ప్రవహించింది.



మడకశిరలో ప్రవహిస్తున్న వర్షపు నీరు

జాతీయ రహదారిపై నిర్లక్ష్యం..!

● కనిపించని హెచ్చరిక బోర్డులు ● నియంత్రించలేక నిత్యం ప్రమాదాలు ● పట్టించుకోని అధికారులు



కొడూరు తోపు వద్ద ఏర్పాటు చేసిన స్పీడు బ్రేకర్లు, నిత్యం ప్రమాదాలు జరుగుతున్న కూడలి

చిలమత్తూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై సూచిక, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. చిలమత్తూరు మండలంలోని కోడూరు తోపు కూడలిలో ప్రమాద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 44వ జాతీయ రహదారి రెండో దశ తారు ఏర్పాటులో భాగంగా స్థానికుల డిమాండ్‌తో ఇక్కడ స్పీడు బ్రేకులు ఏర్పాటు చేశారు. అవి దూరానికి సరిగా కనపడకపోవడంతో వేగంగా వచ్చే వాహనాలు వాటిని గమనించకుండా స్పీడు బ్రేకులపై దూసుకెళుతున్నాయి. దీంతో వాహనాలు అతివేగంగా వచ్చి ఎగిరిపడుతున్నాయి. దీంతో వాహనాల డ్రైవర్లు కంట్రోల్ చేయలేక ప్రమాదాలబారిన పడుతున్నారు. బెంగళూరు నుంచి అనంతపురం వైపు వెళుతున్న వాహనాలు అతి వేగంగా దూసుకువస్తున్నాయి. ఇదే కూడలిలో పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, గోరంట్ల వైపునకు వెళ్లే వాహనాలు మలుపుతిరగాల్సి ఉంది. దీంతో స్పీడు బ్రేకులను గమనించకుండా వేగంగా వచ్చే వాహనాలను నియంత్రణ చేయలేక డ్రైవర్లు అవస్థలు పడుతున్నారు. దీంతో ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. గతంలో వాహనాల వేగ నియంత్రణకు బారికేడ్లు ఏర్పాటు చేసినా వాటిని ఎక్కువ కాలం ఉంచలేకపోతున్నారు. స్పీడు బ్రేకులు ఉండే విషయాన్ని గమనించని వాహన డ్రైవర్లు వేగంగా వస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. కొంత దూరంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేస్తే ఇటువంటి ప్రమదాలు జరగవని వాహనదారులు అభిప్రాయపడుతున్నారు. కొడికొండ చెక్‌పోస్టు, కోడూరు కూడలిలో వెంటనే స్పీడు బ్రేక్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అయ్యప్ప మండల పూజలో పాల్గొన్న మంత్రి

సోమందేపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శివానగర్ అయ్యప్పస్వామి దేవాలయంలో సోమవారం జరిగిన మండల పూజలో బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ముఖ్య అతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అయ్యప్పస్వామి మండల పూజల్లో పాల్గొనడం తన అదృష్టమన్నారు. అనంతరం గురుస్వాములు సుధీర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం శస్త్ర చికిత్సలు చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న టీడీపీ కార్యకర్త చంద్రకళను, అనారోగ్యంతో కాలు కోల్పోయి దివ్యాంగుడిగా మారిన శంకరను పరామర్శించి చెరో రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. ప్రమాదంలో గాయపడిన మండల తెలుగుయువత అధ్యక్షుడు ప్రసాద్‌ను పరామర్శించి రూ.20వేలు ఆర్థిక సాయం అందించారు. మారుతినగర్ పాత సినిమా థియేటర్ పరిసరాల్లో డ్రైనేజీల ఆక్రమణలపై కాలనీ ప్రజలు మంత్రికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు చంద్ర, వెంకటరమణ, సిద్దలింగప్ప, సూరి, సూర్యనారాయరెడ్డి, కిష్టప్ప, రామక్రిష్ణ, జబీవుల్లా పాల్గొన్నారు.



అయ్యప్ప మండల పూజలో పాల్గొన్న మంత్రి సవిత

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్: ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

గుడిబండ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరం పరిష్కరించడానికే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. సోమవారం గుడిబండ తహసీల్దార్ కార్యాలయ ఆవరణంలో మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులతో ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎన్నో ఏళ్ల నుంచి సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చొరవతో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు విన్నవించిన సమస్యలను 40 రోజుల్లోపు పరిష్కరిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో భూ తగాదాలు సృష్టించి పేదల భూములను ధనికులు, వైసీపీ నాయకులు కాజేసి అన్యాయం చేశారని ఆరోపించారు. ప్రజల నుంచి 550 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ కరుణాకర్, ఎంపీడీఓ గంగాధర్, ఏఓ వీరనరేష్, ఏఈ హరి, టీడీపీ నాయకులు శ్రీనివాసమూర్తి, మద్దనకుంటప్ప, మంజునాథ్, పాండురంగప్ప, దుర్గేష్, లక్ష్మీనరసప్ప పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయం తనిఖీ

పంచాయతీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తనిఖీ చేశారు. ఈఓఆర్‌డీ నాగరాజునాయక్, కార్యదర్శి ప్రకాష్‌తో వివరాలు అడిగి తెలుసుకొన్నారు. గత మూడు సంవత్సరాల నుంచి పంచాయతీ ఆదాయం, ఖర్చు రికార్డులను చూపించాలని ఎమ్మెల్యే కోరగా అనంతపురం ఆడిట్ అధికారులకు సమర్పించినట్లు తెలిపారు. రికార్డులను పరిశీలించి తమకు నివేదికను అందించాలని ఎంపీడీఓ గంగాధర్‌కు సూచించారు.

'కులాల మధ్య వైసీపీ నేత ఉష శ్రీచరణ్ చిచ్చు'

పెనుకొండ టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా ఉన్న పెనుకొండలో కులాల మధ్య వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్ చిచ్చుపెడుతున్నారని టీడీపీ మైనార్టీ నాయకులు దాదు, షౌకత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక అన్నా క్యాంటీన్‌లో మైనార్టీ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ కార్యకర్త రియాజ్ ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న జామియా మసీదు స్థలంలో 15 ఏళ్లుగా కమిటీ నిబంధనల మేరకు రేకుల బంకు వేసుకుని జీవనం సాగిస్తున్నాడన్నారు. ఎలాగైనా అతడి బంకు తొలగించాలని కక్షగట్టి ఇటీవల ఘర్షణకు దిగారని, వైసీపీ పాలనలో దాడులు చేశారని తెలిపారు. ఆదివారం రియాజ్‌పై దాడికి యత్నం చేస్తున్న సమయంలో అటువైపు వెళ్తున్న మంత్రి సవిత భర్త వెంకటేశ్వర్‌రావు అడ్డుకుని టీడీపీ కార్యకర్త జోలికి వస్తే వదిలేది లేదని తేల్చిచెప్పారని అన్నారు. ఈ వీడియోను దుష్ప్రచారానికి వాడుకుని మైనార్టీలపై దాడులు చేసిన మంత్రి భర్త అని వైరల్ చేశారని, దీనంతటికి ఉష శ్రీచరణ్ కారణమని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సనా, నిస్సార్, సమీ, ఫయాజ్, ఇర్ఫాన్, అస్లం, షమున్, నజీర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

పిల్లల్లో విలువలు పెంపొందించాలి



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న చిన్నారులు

హిందూపురం అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): అనురాగ, ఆప్యాయతలు అందించి పిల్లల్లో విలువలు పెంపొందేలా తయారు చేయాలని సమితి అధ్యక్షుడు కట్టా రత్నయ్య, కార్యదర్శి జయప్రకాష్ పేర్కొన్నారు. సోమవారం పట్టణ పరిధిలోని శ్రీవిద్యారణ్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో తల్లిదండ్రులకు పాదపూజ చేసే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ తల్లిదండ్రులకు సేవ చేస్తే ముక్కోటి దేవతలకు సేవ చేసినట్టే నని తెలిపారు. వారు కడుపునిండా తినకపోయినా తమ పిల్లలకు అన్ని సౌకర్యాలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం, సిబ్బంది బద్రీనాథ్, బాలాజీ, దేవాంగం శంకరప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వరి రైతులకు ఫెంగల్ బెంగ..!



కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట

పెనుకొండ రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో వరిపంట సాగుచేసిన రైతుల్లో ఫెంగల్ తుఫాన్ ఆందోళన రేకెత్తిస్తోంది. పంట ప్రస్తుతం కోతకు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో తుఫాన్ ప్రభావంతో దెబ్బతింటోంది. పెనుకొండ మండలంలో 300 హెక్టార్లలో, సోమందేపల్లిలో 192 హెక్టార్లు, రొద్దంలో 460, కొత్తచెరువులో 610, బుక్కపట్నంలో 480, పుట్టపర్తిలో 490 హెక్టార్లలో బోరుబావుల కింద వరి సాగుచేశారు. ఇప్పటికే ఆయా మండలాల్లో సాగుచేసిన రైతులు 60 నుంచి 70 శాతం వరి పంట కోశారు. తుఫాన్ కారణంగా కోతదశలో ఉన్న వరిపంటను నిలిపివేశారు. రెండ్రోజులుగా తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వర్షం కురిస్తే కోతకు సిద్ధంగా ఉన్న పంట తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళనలో పడ్డారు.

ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు

● వైసీపీ నాయకుల సూచనలతో బిల్లులు ఆపిన ఏపీఓ ● పీడీ విజయప్రసాద్ ఆగ్రహం

పరిగి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం పనుల్లో పలు అవకతవకలు వెలుగుచూశాయి. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ పనులపై డ్వామా పీడీ విజయప్రసాద్ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ నిర్వహించారు. రూ.5.40 కోట్ల ఉపాధి హామీ నిధులతో మండల వ్యాప్తంగా చేపట్టిన పనులపై పరిశీలన జరిపారు. ఉపాధి పనులపై ఉన్నతాధికారులు సర్వే చేపట్టగా మండల వ్యాప్తంగా ఉపాధిహామీ పనులకు ఎలాంటి ఫొటోలు లేకుండా జాబితాను అధికారులు ముందుకు తీసుకొచ్చారు. ఈ విషయంపై ఆగ్రహించిన పీడీ వెంటనే ఫొటోలు జతపరిచి వివరాలు తెలపాలని టెక్నికల్ అసిస్టెంట్లను ఆదేశించారు. అనంతరం కాలువపల్లికి చెందిన మాజీ ఎంపీపీ సత్యనారాయణ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా గతంలో పంచాయతీకి సంబంధించి చెత్తసంపద షెడ్డు నిర్మాణం చేపట్టానని తెలిపారు. టీడీపీ ప్రభుత్వం అధికారం కోల్పోవడంతో ఏపీఓ చంద్రశేఖర్ వైసీపీ నాయకులు చెప్పిన మాటలు విని బిల్లులు మంజూరు చేయలేదన్నారు. ప్రభుత్వ రికార్డుల్లో రూ.7.60 లక్షల నిధులు మంజూరుకాగా రూ.6లక్షలు నగదు మాత్రమే జమచేశారని, మిగతా రూ.1.60 లక్షలు ఎవరి ఖాతాలో జమచేసుకున్నారో వివరించాలని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై స్పందించిన పీడీ విజయ్ ప్రసాద్ మాట్లాడుతూ రూ.1.60లక్షలు ఎవరి ఖాతాలో జమచేశారో వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని ఏపీఓ చంద్రశేఖర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ నాగేశ్వర్‌రావు, ఎంపీడీఓ శ్రీధర్, ఎస్ఆర్‌పీ ఆవులయ్య, సచివాలయ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



ఏపీఓపై పీడీకి ఫిర్యాదు చేస్తున్న బాధితుడు సత్యనారాయణ

గ్రామాల్లో సమస్యలను గుర్తించండి: మంత్రి



టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని, గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలను గుర్తించాలని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో పెనుకొండ మండల టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రహదారులు, మంచినీరు, వీధిలైట్లు తదితర సమస్యలను గుర్తించి తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. త్వరలోనే రేషన్‌కార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యాదవ సంఘం డైరెక్టర్ కేశవయ్య, నాయకులు నారాయణస్వామి, లక్ష్మీనారాయణరెడ్డి, సూరి, చిన్నవెంకటరాముడు, పోతిరెడ్డి, సిద్దయ్య పాల్గొన్నారు.

సబ్సిడీతో విత్తన వేరుశనగ పంపిణీ



వేరుశనగ పంపిణీ చేస్తున్న అధికారులు

మడకశిర, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో బోరు, బావుల కింద సాగు చేసేందుకు సబ్సిడీతో విత్తన వేరుశనగ కాయలు ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. మడకశిర డివిజన్‌కు 2050 క్వింటాళ్ల వేరుశనగను విత్తనకాయలను కేటాయించింది. మడకశిర డివిజన్‌లో రబీలో సాధారణ సాగు ఆరు వేల ఎకరాలు ఉండగా.. ఐదువేల ఎకరాలకు సరిపడా ప్రభుత్వం విత్తనకాయలు కేటాయించింది. ఈనెల 15వ తేదీ వరకు సబ్సిడీ వేరుశనగ కాయలు రైతులకు పంపిణీ చేస్తామని మండల వ్యవసాయశాఖ అధికారి తిమ్మప్ప తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మడకశిర మండలానికి 400 క్వింటాళ్లు, రొళ్లకు 400, అమరాపురానికి 600, గుడిబండకు 650, అగళి మండలానికి 150 క్వింటాళ్ల విత్తనాన్ని కేటాయించారని తెలిపారు. వేరుశనగ పూర్తి ధర క్వింటాల్ రూ.9600 కాగా, సబ్సిడీ రూ.3840 పోను క్వింటాలుకు రైతు రూ.5760 చెల్లించాలన్నారు. రైతు ఆధార్‌కార్డు, కరెంట్ బిల్లు తప్పని సరిగా ఉండాలని తెలిపారు.

ప్రతి చెరువును నింపడమే లక్ష్యం: ఎమ్మెల్యే

మడకశిరటౌన్/మడకశిర రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వెనకబడిన మడకశిర ప్రాంతంలో ప్రతి చెరువుకు నీరు నింపడమే లక్ష్యమని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పేర్కొన్నారు. సోమవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి ఇరిగేషన్ శాఖ ఇంజనీర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర హంద్రీనీవా బ్రాంచికెనాల్‌కు త్వరితగతిన నీరు చేర్చేందుకు గల మార్గాలపై చర్చించారు. బైపాస్ కెనాల్‌ను ఏర్పాటు చేసి నేరుగా మడకశిర చెరువులకు నీరు నింపేందుకు తీసుకోవాల్సిన చర్యల పట్ల వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాసమూర్తి, లక్ష్మీనారాయణ, కృష్ణమూర్తి పాల్గొన్నారు. మడకశిర మండలంలోని గొల్లపల్లి గ్రామ సమీపంలో ఉన్న హంద్రీనీవా కాలువను, అక్కడ ఉన్న పంపుహౌసును ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సాయంత్రం పరిశీలించారు.

హెచ్‌ఎం సస్పెన్షన్ సమంజసం కాదు : యూటీఎఫ్

మడకశిర రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆమిదాలగొంది ఉన్నత పాఠశాలలో జరిగిన సంఘటనకు ప్రధానోపాధ్యాయుడిని సస్పెండ్ చేయడం సమంజసంకాదని యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు భూతన్న, ఉపాధ్యక్షుడు బాబు పేర్కొన్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మేనమామే విద్యార్థి చేతన్‌కుమార్‌ను తీసుకెళ్లి హత్యచేయడం హేయమైన చర్య అన్నారు. పాఠశాలలో 438 మంది విద్యార్థులు ఉన్నారని, పాఠశాలలో అపార్ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పని ఒత్తిడిలో ఉన్నారని తెలిపారు. హెచ్‌ఎం సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాని, అదే విధంగా పీఈటీకి ఇచ్చిన షోకాజ్ నోటీసులను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.

90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాల పంపిణీ

పెనుకొండ రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో డ్రిప్ పరికరాలు అందించకపోవడంతో రైతులు లక్షలు వెచ్చించి కొనుగోలు చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 90 శాతం సబ్సిడీతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అందిస్తున్న సబ్సిడీ పథకాలపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా సోమవారం రొద్దం మండలంలోని ఏపీఎంఐసీ ఎంఐఓ నరసింహ ఆధ్వర్యంలో రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందజేశారు. ఐదెకరాలలోపున్న రైతులకు 90 శాతం, పదెకరాలలోపున్న రైతుకు 70 శాతం, 10ఎకరాలుపైబడి ఉన్న రైతులకు 50 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందిస్తున్నామని తెలిపారు. పరికరాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని హెచ్ఓ రాంప్రసాద్ తెలిపారు.

ఘనంగా జ్యోతుల ఉత్సవం



వాల్మీకి మహర్షికి జ్యోతులు సమర్పిస్తున్న మహిళలు

పెనుకొండ రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుద్దేబండలో వెలసిన వాల్మీకి మహర్షి విగ్రహానికి గ్రామస్థులు వైభవంగా జ్యోతుల ఉత్సవం నిర్వహించారు. సోమవారం బోయ రామక్రిష్ణ ఆధ్వర్యంలో వాల్మీకి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని దుద్దేబండ, గొల్లపల్లి, గ్రామస్థులు, మహిళలు పెద్దఎత్తున వాల్మీకి విగ్రహానికి జ్యోతులు సమర్పించారు.

ఎస్సీ వర్గీకరణను అమలు చేయండి

పావగడ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలుకు చర్యలు తీసుకోవాలని తుమకూరు జిల్లా దళిత సంఘం నాయకులు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు వినతి పత్రం అందించారు. సోమవారం తుమకూరు పట్టణానికి వచ్చిన ముఖ్యమంత్రిని డీఎస్‌ఎస్ జిల్లా కన్వీనర్ కేబుల్ రఘు, కొట్టాశంకర్, మరలూరు కృష్ణమూర్తి, టీఎన్ పేట రమేష్, గాంధీరాజు, కిరణ్, గోపాల్, రవికుమార్ తదితరులు కలిశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ నాగామోహనదాస్ అధ్యక్షతన ఇప్పటికే కమిటీ వేశామని, రెండు నెలల్లోపు సమీక్షించి వర్గీకరణను అమలు చేస్తామని హామీ ఇవ్వడంతో దళిత నాయకులు హర్షం వ్యక్తం చేశారు.



ముఖ్యమంత్రికి వినతి పత్రం ఇస్తున్న దళిత నాయకులు